

ప్రారంభానికి నోచుకోని గోషా ఆసుపత్రి

సత్యాజీ

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి సమస్యల స్వాగతం
- గోషా ఆసుపత్రి ప్రారంభం ఎప్పుడు.. ?
- రూ.3 కోట్ల భవనాన్ని ఆక్రమించినా చర్యలు శూన్యం
- సమయపాలన పాటించని జీజీహెచ్ వైద్యులు
- కలెక్టరుకు ఐవోసీ ఇచ్చిన హామీ ఏమైంది ?

సంస్కరణల ఊసేది ?

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 8: గత వైసీపీ ప్రభుత్వంలో నిర్యక్షానికి గురైన వైద్యశాఖను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జగన్ పాలనలో వైద్యులు, సిబ్బంది ఆడిందే ఆటగా... పాడింది పాటగా గడిచింది. ఎన్నో సంస్కరణలు చేపట్టినా వైద్యశాఖలో మాత్రం మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వైద్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి, తొలిసారిగా సత్యకుమార్ జిల్లాలో అడుగుపెడుతున్నారు. ఆ శాఖలోని అనేక సమస్యలు ఆయనకు స్వాగతం పలుకుతున్నాయి. వైద్యశాఖలో సంస్కరణలు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యశాఖకు ఏడాదికి రూ. 25కోట్లు వస్తున్నా, వాటిద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ఆ దిశగా కృషి జరగడం లేదన్న విమర్శలు లేకపోలేదు. గతవైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ఆరోగ్య సేవలను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● గోషా ఆసుపత్రి, ఆక్రమణల సంగతేంటి ?

2021 జనవరిలో వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన గోషా ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. 100 పడకలతో ఉన్న ఈ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆరునెలల క్రితమే ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. 25 మంది స్టాఫ్‌నర్సులు, 10 మంది ఏఎన్ఎంలు, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండెంట్, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను నియమించాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు. అంతేకాక కార్యాలయ సిబ్బంది యూడీసీ, ఎల్‌డీసీలతో పాటు టైపిస్టు నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అయినా ఇంతవరకు ఆ నియామకాలు చేపట్టలేదు.



ఆక్రమణలో వైద్యశాఖ భవనం

ఇదిలాఉండగా ఈ ఆసుపత్రి ప్రాంగణంలోనే రూ. 3 కోట్ల విలువైన పాత భవనాన్ని వైసీపీ చెందిన వ్యక్తి ఆక్రమించినా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నేటికీ ఖాళీ చేయించలేదు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 52 పీహెచ్‌సీలు, 495 విలేజ్ హెల్త్ సెంటర్‌లు ఉన్నా వైద్య చికిత్సలు నామమాత్రంగానే ఉన్నాయి. విలేజ్ హెల్త్ సెంటర్లు 412 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటికి అద్దె చెల్లింపులో నేటికీ వైద్య ఆరోగ్యశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగాల్సి ఉన్నా, సుమారు 10 పీహెచ్‌సీల్లో నేటికీ ఒక్క ప్రసవం కూడా జరగలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా 45 వేల ప్రసవాలు జరుగుతుండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కేవలం 10 వేల ప్రసవాలు మాత్రమే జరుగుతున్నాయి. దీన్నిబట్టి వైద్యశాఖ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

● అక్కడా సంస్కరణలేవి ?

జిల్లాలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ సర్వీసెస్ కింద ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. ఆయా కేంద్రా ల్లోనూ ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆయా ఆరోగ్య కేంద్రాల్లో 124 మంది వైద్యులు ఉన్నారు. మరో 28 వైద్యుల నియామకం చేపట్టాల్సి ఉంది. అలాగే హెడ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియాలజీ టెక్నీషియన్లు మరో 14 మంది సిబ్బంది అవ సరం ఉన్నా నేటికి నియామకాలు చేపట్టలేదు. ఇవన్నీ ఇలాఉండగా నెల్లూరు నగరంలోని క్షయ ఆసుపత్రికి చెందిన రూ. 5 కోట్ల విలువైన స్థలాన్ని రెవెన్యూ విభాగానికి పెట్రోల్ బంక్ కింద కేటాయించారు. ఈ నేపథ్యంలో ఇండియన్ అయిల్ కార్పొరేషన్(ఐవోసీ)వారు రూ. 30 లక్షల విలువైన టిఫాస్కాన్‌ను ఆత్మకూరు జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తామని గత కలెక్టర్ హరినారాయణకు హామీ ఇచ్చారు. అలాగే సామాజిక, ఏరియా ఆసుపత్రుల్లోనూ ఈఎన్‌టీ పరికరాలతోపాటు మరో రూ. 37 లక్షల విలువైన పరికరాలు ఇస్తామని కూడా కంపెనీ హామీ ఇచ్చింది. అయితే పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్న ఐవోసీ ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చలేదు.

జీజీహెచ్‌లోనూ మార్పులేవి ?

జీజీహెచ్‌లో కూడా 126 మంది వైద్యులు ఉన్నారు. వీరిలో ఎక్కువమంది వైద్యులు సక్రమంగా విధులకు హాజరు కావటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు విభాగాల హెచ్‌వోడీలు విశ్రాంతి గదులకే పరిమిత మవుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. హైపటైటిస్ రోగులను ఓ వైద్యుడు తన ప్రైవేట్ క్లినిక్‌కు రప్పించుకుంటూ వేల రూపాయలు గుంజుతున్నట్లు సమాచారం. అలాగే ఎమ్మారై, సిటీ స్కానింగ్‌లు చేయించుకునే రోగులకు రిపోర్టులు ఇవ్వటంలో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇక పోస్టుమార్టం విభాగంలోనూ డబ్బులు ఇవ్వందే మృతదేహాన్ని ఇవ్వరన్న విమర్శలు లేకపోలేదు. 750 పడకలు ఉన్నా జీజీహెచ్‌లో కొంతమంది వైద్యులు మెరుగైన వైద్య చికిత్స అందిస్తూ పేరుతెచ్చుకుంటున్నారు. మరికొందరి తీరు వల్ల ఆసుపత్రికే చెడ్డపేరు వస్తున్నది. వీటన్నింటిపై మంత్రి సత్యకుమార్ దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. ఈ క్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. సీఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి నాడు-నేడు, తల్లికివందనం, విద్యాకానుక తదితర కార్యక్రమాలను ఈ కమిటీ పర్యవేక్షిం చేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఎన్నికల్లో పోటీచేసేందుకు పలువురు తల్లిదండ్రులు ఆసక్తి చూపారు. జిల్లా విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి గురువారం ఎన్నిక లను నిర్వహించింది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నికలు ఇష్టానుసారంగా నిర్వహించగా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అందరి ఆమోదంతో 1,980 పాఠశాలలు ఏకగ్రీవం అయ్యాయి.



సీతారామపురం ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఎంసీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో షేక్ మస్తాన్‌వలి

1,980 పాఠశాలల్లో ఏకగ్రీవం

604 స్కూళ్లలోనే ఎలక్షన్స్

27 చోట్ల వాయిదా

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

● చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక

చేతులెత్తే పద్ధతిలో గురువారం ఎన్నికలు జరిపారు. గతంలో పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ పాలక వర్గాల గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహిం చకుండా పాతవారి పదవీకాలన్నే పొడిగించారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ ఎన్నికలు రాజకీయ నేతల కనుసన్నల్లోనే జరిగాయి. తమ అనుచరులనే చైర్మన్‌లుగా చేయాలన్న లక్ష్యంతో చేసిన ప్రయత్నాలు పలు ప్రాంతాల్లో వివాదాలకు దారితీశా యి. దీంతో పాటు అన్ని పాఠశాలలను ఏక గ్రీవం చేసుకున్నారు. అయితే ప్రస్తు తం మారిన పరిస్థితుల నేపథ్యంలో రాజ కీయ ప్రమేయం లేకుండా ఎన్నికలు నిర్వహిం చేలా అధికార యంత్రాంగం కృషి చేసింది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం స్థానిక పరిస్థితుల కారణంగా ఎన్నికలు వాయి దా పడగా, అత్యధిక ప్రాంతాల్లో ప్రశాం తంగా జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఏకగ్రీవమైన పాఠశాల ల్లో తమకు నచ్చిన వారిని తరగతికి ముగ్గురు చొప్పున గరిష్ఠంగా 23 మం దిని ఎంపిక చేసి మరో ఐదుగురు కోఆప్షన్ సభ్యులను నియమించారు. ఎన్నికలు జరిగిన పాఠ శాలల్లో చైల్డ్ ఇన్ఫోలో నమోదైన ప్రతి ఒక్క విద్యార్థి తల్లి, తండ్రి లేదా సంరక్షుడు ఒకరికి ఓటు హక్కు కల్పించారు. అయితే అధికారులు ఉదయం 7 నుంచి మధ్నాహ్నం 1 గంటలోపు ఎన్నికలు నిర్వహిస్తామని తొలుత ప్రకటించినా, అత్యధిక ప్రాంతాల్లో మధ్నాహ్నం వరకు కూడా నిర్వహించలేకపోయారు. అన్ని ప్రాంతాల్లో సర్దుబాట్ల అనంతరమే ఎన్నికలు పూర్తిచేసినట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

● 604 చోట్లే ఎన్నికలు

జిల్లాలోని 38 మండలాల్లో 2,622 పాఠశాలలు ఉండగా వీటిలో 2611 పాఠశాలలు ఎన్నికలకు ఎంట్రీలు నమోదు చేసుకున్నాయి. వీటిలో 1980 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా 604 పాఠశాలల్లో మాత్రం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తల్లి దండ్రులు, సంరక్షలు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని 27 పాఠశాలల్లో మాత్రం స్థానిక పరిస్థి తులు, పరస్పర సహకా రాలు లేకపోవడం, స్వల్ప వివాదాల మధ్య అధికారులు ఎన్నికలు వాయిదా వేశారు. వాయిదా పడ్డ పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు అందచేసి వారి ఆదేశాల మేరకు ఎంట్రీ కాని పాఠశాలలకు, వాయిదా పడిన పాఠశాలలకు ఎన్నికలు నిర్వహిం చేలా చర్యలు తీసుకుంటా మని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలను డీఈవో రామారావు, ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషా రాణి, సమగ్ర శిక్ష సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

\- నెల్లూరు (విద్య)

అక్కంపేటలో ఆగిన ఎన్నిక

- కాంగ్రెస్, టీడీపీ వర్గీయుల రాకతో రగడ
- పోలీసుల రంగప్రవేశం

మనుబోలు: ఎస్ఎంసీ ఎన్నికలు మనుబోలు మండలం అక్కంపేట ఉన్నత పాఠశాలలో గురువారం అసెంబ్లీ ఎలక్షన్లను తలపించాయి. పాఠశాల వద్దకు టీడీపీ, కాంగ్రెస్ వర్గీయులు రావడంతో రగడ మొదలైంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. హెచ్ఎం సెలవుపెట్టడంతో ఇన్‌చార్జి హెచ్ఎం దయామణి ఎన్నికను నిర్వహించారు. ముందుగా 3నుంచి 8తరగతుల వరకు ముగ్గురేసి చొప్పున కమిటీ సభ్యులను ఎంపికచేశారు. మధ్యాహ్నం నుంచి చైర్మన్ ఎన్నిక జరపాల్సి ఉండగా, 24మంది సభ్యులతో ప్రారంభించారు. ఇంతలోకి అక్కడికి రాజకీయ నేతలు రావడంతో ఇన్‌చార్జి హెచ్ఎం ఎలా ఎన్నిక నిర్వహిస్తారని టీడీపీ నేతలు ప్రశ్నించారు. ఎన్నిక జరపాల్సిందేనంటూ కాంగ్రెస్ నేత పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాలు వాదనలకు దిగాయి. సాయంత్రం ఐదు వరకు వాగ్వాదం జరిగింది. అనంతరం ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ తనకు ఆరోగ్యం బాగా లేదని, ఇవాళ ఎన్నిక నిర్వహించలేనని చెప్పింది. ఇంతలోనే ఆమె అస్వస్థతకు గురవడంతో 108లో చికిత్స నిమిత్తం నెల్లూరుకి తరలించారు. దీంతో సీఐ రాంబాబు, ఎస్ఐలు రామకృష్ణ, అజయ్‌కుమార్ ఇరుపార్టీల నాయకులను, కమిటీసభ్యులకు సర్దిచెప్పి స్కూల్ నుంచి పంపేశారు.



మనుబోలు : ఇన్‌చార్జి హెచ్ఎంతో వాదిస్తున్న కమిటీ సభ్యులు

సీఐల బదిలీల వివరాలు

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రాంతం
ఎస్‌కె నఫీజ్ బాషా	కందుకూరు సర్కిల్	మాచర్ల రూరల్, పల్నాడు జిల్లా
కేశవ వెంకటేశ్వరరావు	పీసీఆర్, ప్రకాశం జిల్లా	కందుకూరు సర్కిల్
జీ మంగారావ	పెద్దకూరపాడు సర్కిల్, పల్నాడు	గుడ్లూరు సర్కిల్
బీ వీరవెంకట సుబ్బారావు	గుడ్లూరు సర్కిల్	రేంజ్ కర్యాలయం
టీవీ శ్రీనివాసరావు	కోవూరు సర్కిల్	కారంపూడి సర్కిల్, పల్నాడు జిల్లా
ఆర్ అహ్మద్ జానీ	డీఎస్‌బీ-2	బాపట్ల టౌన్ పీఎస్
షేక్ అన్వర్‌బాషా	కొత్తపేట పీఎస్, గుంటూరు	నవాబుపేట పోలీసు స్టేషన్
ఎం బాబి	నవాబుపేట పోలీసు స్టేషన్	నాయుడుపేట అర్బన్ పీఎస్, తిరుపతి జిల్లా
ఎం రోశయ్య	సౌత్‌ట్రాఫిక్ పీఎస్	దర్గామిట్ట పోలీసు స్టేషన్
హెచ్ఎస్ హుసేన్‌బాషా	దర్గామిట్ట పీఎస్	రేంజ్ కార్యాలయం
హెచ్ఎస్ హుస్సేన్‌బాషా	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్	వాకాడు సర్కిల్, తిరుపతి
కే వేమారెడి	మహిళా పీఎస్-1 గుంటూరు	సంగం సర్కిల్
రవినాయక్	సంగం సర్కిల్	రేంజ్ కార్యాలయం
జీ గంగాధర్‌రావు	రేంజ్ వీఆర్	ఆత్మకూరు సర్కిల్
జీ వేణు	ఆత్మకూరు సర్కిల్	రేంజ్ కార్యాలయం
ఎండీ ఫిరోజ్	కలిగిరి సర్కిల్	కావలి -1 పీఎస్
రాజేష్	కావలి-1 పీఎస్	రేంజ్ కార్యాలయం

పోలీసుశాఖలో భారీగా బదిలీలు

డీఎస్పీలు, సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8 : పోలీసు శాఖలో బదిలీల పర్వం ఊపందుకుంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆత్మకూరు డీఎస్పీగా ఉన్న ఎస్ కోటారెడ్డి పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీకాగా, ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కే వేణుగోపాల్‌ను నియమించారు. గుంటూరు రేంజ్ పరిధిలో 30 మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.

డీఎంహెచ్‌వో సంతకం ఫోర్జరీ

● కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) సంతకం ఫోర్జరీ చేసి, నకిలీ అపాయింట్‌మెంట్లు ఇచ్చిన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, తిరుపతి జిల్లాకు చెందిన కరీముల్లాకు నెల్లూరులోని వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులతో ఎంతోకాలంగా పరిచయాలున్నాయి. దీంతో ఆయన పలువురు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని, కాంట్రాక్టు ప్రాతిపదికన సాఫ్టనర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురి వద్ద నుంచి రూ.14 లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా డీఎంహెచ్‌వో పేరుతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్ వారికి అందించాడు. ఈ క్రమంలో బాధితుడు వెంకటకృష్ణ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిశాడు. తనకు మర్రిపాడు పీహెచ్‌సీలో పోస్టింగ్ ఇవ్వాలని కోరాడు.కంగుతున్న డీఎంహెచ్‌వో నియామక పత్రాన్ని పరిశీలించారు. అందులో ఉన్న సంతకం తనదికాదని, ఎవరో ఫోర్జరీ చేశారని గుర్తించారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం రాత్రి ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో జడ్పీ

- తగ్గిపోతున్న ఆదాయ వనరులు
- పట్టించుకునే నాథుడే కరువు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు
- రేపు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

నెల్లూరు, (జడ్పీ), ఆగస్టు 8: జిల్లాపరిషత్(జడ్పీ) ఆదాయ వనరులు, అధికారాలు నానాటికీ కుంచించుకుపోతున్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో జడ్పీ కునారిల్లుతోంది. గతంలో ఉన్న అధికారాలు, ఆదాయమార్గాలు లేకపోవటంతో మొక్కుబడి సమావేశాలకే పరిమితమవుతున్నది. జిల్లా మంత్రులతో పాటు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొనే జిల్లా అత్యున్నత సమీక్ష సమావేశాలకు జడ్పీ వేదిక అయినా, ఆర్థిక కష్టాలు తీర్చే నాథుడే కరువయ్యాడు. ఉమ్మడి జిల్లాలోని 46 మండలాలకు వేదికైన జిల్లా పరిషత్ సమావేశం శనివారం జరగనుంది.

● దూరమైపోతున్న ఆర్థిక వనరులు



ఏ సంస్థ అబివృద్ధి చెందాలన్నా ఆర్థికవనరులే కీలకం. పేరుకి జిల్లాలోని గ్రామీణశాఖలను పర్యవేక్షించే అధికారం మాత్రం జడ్పీకి ఉండగా, ఆర్థిక వనరులు మాత్రం ఉండటం లేదు. గతంలో ఇసుక సీనరైజ్ చార్జీలతోపాటు, మైనింగ్, స్టేట్ ఫైనాన్ష్ కమిషన్ ఫర్ క్యాపిటల్ గ్రాంట్, స్టాంపు డ్యూటీ, ఆర్థిక సంఘం జనరల్ ఫండ్, నిధులు జిల్లా పరిషత్‌కి భారీగా వచ్చేవి, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసే అవకాశం ఉండేది. కేవలం ఇసుక సీనరైజ్ చార్జీలే ఏడాదికి రూ.10కోట్ల మేర వచ్చేవి, అలాగే స్టేట్ ఫైనాన్స్ నుంచి రూ.4 నుంచి రూ.5కోట్లు వరకు వచ్చేవి. అయితే కొన్నేళ్లుగా ఇసుక సీనరైజ్ చార్జీలతోపాటు, స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోయాయి. అలాగే స్టాంపు డ్యూటీ, మైనింగ్ సెక్టార్ల చార్జీలు కూడా అరకొరగా వస్తున్నాయి. జనరల్ ఫండ్ నిధులు మాత్రం కొంతమేరకు వస్తున్నాయి. ఈ నిధులను కూడా అభివృద్ధి పనులకు వినియోగించుకునేందుకు వీలులేకుం డా జడ్పీపై పింఛనర్ల భారం పడింది. దాదాపు వందమంది పెన్షన్లకు నెలకి రూ.20 లక్షల చొప్పున సంవత్సరానికి రూ.2.40 కోట్లు చెల్లించాల్సి వస్తున్నది. సహజంగా పెన్షర్ల వేతనాల బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. జడ్పీకి పెన్షన్ల భారం తగ్గిస్తే ఏడాది రూ.2.40కోట్లు నిధులు అభివృద్ధి పనులకు వినియోగించుకునే అవకాశం ఉంది.

● నిధుల విడుదలపై చర్చించాలి

ఇకపోతే రిజిస్ట్రేషన్‌శాఖ, మైనింగ్ నుంచి రావాల్సిన స్టాంపు డ్యూటీలు. ఇసుక సీనరైజ్, స్టేట్ ఫైనాన్స్ నిధులు జడ్పీకి వచ్చేలా సభ్యులు సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి విన్నవించాలి. సభ్యులు నిధుల మంజూరుకు కృషి చేస్తే జిల్లా పరిషత్‌కి ఆర్థిక కష్టాలు చాలా వరకు తీరే అవకాశాలు ఉన్నాయి. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు జడ్పీకి ఏడాదికి రూ.19 కోట్ల మేర వస్తున్నా... అవి కరెంటు చార్జీలు, తాగునీటి నిర్వహణకే ఖర్చవవు తున్నాయి. దీంతో వస్తున్న అరకొర నిధులతో అభివృద్ధి పనులకు అవకాశం లేకుండా పోయింది.

● మొక్కుబడిగా సమావేశాలు

గత ఐదేళ్లుగా జడ్పీటీసీలతోపాటు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికార పార్టీకి చెందిన వారు కావటంతో సమావేశాలు మొక్కుబడిగా జరిగేవి. సమస్యలపై చర్చ లేకుండానే ప్రభుత్వానికి అనుకూలంగా నిర్వహిస్తూ వచ్చారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావటం, మంత్రులతోపాటు ఎమ్మెల్యేలంతా అధికార పార్టీవారే ఉండంతో వారందరికీ శనివారం జరిగే జడ్పీ సమావేశం తొలి కావడంతో ఆర్థిక వసరులపై ప్రత్యేకంగా చర్చించాలని ప్రజలు ఆశిస్తున్నారు. అలాగే గతంలో ఉపాధ్యాయుల బదిలీలు, తదితర అధికారాలు జడ్పీకి ఉండగా ప్రస్తుతం అవి లేకుండా పోయాయి. వీటన్నింటిపై ప్రత్యేకంగా చర్చించి జడ్పీ బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- అయ్యోర్లకు తప్పిన ఫొటోల భారం
- మరుగుదొడ్ల ఛాయాచిత్రాలు తీయక్కర్లేదని ఆదేశాలు
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

యాప్‌ల యాతన ఇకలేనట్టే !

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 : పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఛాయాచిత్రాలు (ఫొటోలు) తీసే పరిస్థితి నుంచి ఉపాధ్యాయులకు ఉపశమనం లభించింది. స్కూళ్లలో మరుగుదొడ్ల శుభ్రతను ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలని, నిత్యం ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి అయ్యోర్లు ఈ ఫొటోలు తీయడంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.అంతేకాక ఎన్నో సార్లు మెమోలు కూడా అందుకున్నారు. తమకు బోధనేతర పనులు అప్పగించడం తగదని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఉపాధ్యాయులు అనేక మార్లు నిరసన తెలియచేశారు. ఈ విషయమై ప్రస్తుత కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బడుల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయక్కర్లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు ఇవ్వడంతో ఫొటోల బాధ్యతల నుంచి టీచర్లను తొలగిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు మూడురోజుల క్రితం ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

● హర్షణీయం : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను తప్పిస్తూ మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఇబ్బందులపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభ పరిణామమన్నారు.



పాఠశాల మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

గురువులకు విముక్తి : ఏపీ ఉపాధ్యాయ సంఘం

బాత్రూమ్ ఫొటోలు తీసే బాధ్యత నుంచి టీచర్లకు విముక్తి లభించిందని ఏపీ ఉపాధ్యా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేకే రాజగోపాలాచారి, పీ అనిల్‌కుమార్‌లు తెలిపారు. గౌరవప్రదంగా పనిచేసే ఉపాధ్యాయులు నిత్యం బాత్రూమ్ ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలనడం తమను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ పని నుంచి తమను విముక్తులను చేయడం హర్షణీయమన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు

రంగం సిద్ధం

రేపటి నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్

12 నుంచి నూతన స్థానాల్లో నియామకం

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన చర్యలు

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం మండలాల్లో ఎంఈవోలకు ఆన్‌లైన్‌లో తెలియచేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలల జాబితాను సిద్ధం చేశారు. ఆ జాబితాల ప్రకారం కేడర్ సీనియారిటీ వివరాలను పంపిస్తారు. దీనికి అనుగుణంగా సర్‌ప్లస్ జాబితాలోని ఆయా సబ్జెక్టులలో జూనియర్లను గుర్తించడంతోపాటు కొరత ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు. ఖాళీల వివరాలతో ఈనెల 9వతేదీ(శుక్రవారం) ఎంఈవోల లాగిన్‌కు డేటాను విడుదల చేయనున్నారు. 10వ తేదీ సర్‌ప్లస్ టీచర్లను మండల కేంద్రానికి ఎంఈవోలు పిలిపించి స్థానికంగా సబ్జెక్టుల వారీగా కొరత ఉన్న పాఠశాలల జాబితాను ప్రదర్శించి వాటిలో ఖాళీలను ఎంచుకునేలా టీచర్ల ఆమోదాన్ని తీసుకుంటారు. వారు ఎంచుకున్న ఖాళీని ఆన్‌లైన్ విధానంలో అక్కడికక్కడే నమోదు చేస్తారు. సంబంధిత ఖాళీల్లో తాత్కాలిక నియామకం కింద ఈనెల 11వతేదీ లోపల ఆన్‌లైన్ ఉత్తర్వులు అందచేస్తారు. నియామక ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు 12వతేదీ నూతన బదిలీ స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుందని జిల్లా అధికారులు తెలిపారు.



ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరిగే ఈ నియామకాల్లో ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు తాత్కాలిక స్థానాల్లో పనిచేయనున్నారు. విజువల్లీ హ్యాండీ కాప్డ్ టీచర్లు, వచ్చే ఏడాది ఏప్రిల్ 31వతేదీ నాటికి ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను మినహాయించారు. పని సర్దుబాటు తర్వాత కూడా మండలాల్లో ఇంకా మిగిలి ఉన్న సర్‌ప్లస్ టీచర్లను డీవైఈవో పూల్‌లో చేర్చుతారు. సంబంధిత డివిజన్‌లో కొరత ఉన్న పాఠశాలలకు వారిని సర్దుబాటు చేసుకోవచ్చు. అక్కడ కూడా మిగిలిపోతే డీఈవో పూల్‌కు చేర్చుతారు. మండలంలో టీచర్ల కొరత ఉన్న హైస్కూల్‌కే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో సర్దుబాటుకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనికిగాను ఏ మండలంలోనైనా సబ్జెక్ట్ టీచర్లు దొరకకపోతే సర్‌ప్లస్‌గా ఉన్న ఎస్‌జీటీల పీజీ అర్హతను ప్రామాణికంగా తీసుకుని ఆయా సబ్జెక్టులకు ఉన్నత పాఠశాలల్లో నియమించేందుకు వెసులుబాటు కల్పించారు. జిల్లాలోని ప్రతి మండలంలో దాదాపు 30 నుంచి 40 మంది సరప్లస్ టీచర్లు ఉండగా అక్కడ గరిష్ఠంగా 15 నుంచి 17 మంది వరకే కొరత ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. దీనిప్రకారం సర్‌ప్లస్ టీచర్లంతా దాదాపు ప్రస్తుతం వారుపనిచేస్తున్న మండలాల్లోనే సర్దుబాటు అవుతారని అంచనా. మొత్తం మీద జీవో నెంబరు 117 ఉత్తర్వుల పేరు ప్రస్తావించకపోయినా వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంతా ఆ ఉత్తర్వుల మార్గదర్శకాలు, ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ప్రకారమే జరుగుతున్నట్లు తెలుస్తోంది.

కళ్లలో కారం కొట్టి, కత్తితో పొడిచి..

● ఆత్మకూరులో మహిళపై మరో మహిళ దాడి



విచారణ జరుపుతున్న ఎస్ఐ ముత్యాలరావు

ఆత్మకూరు, ఆగస్టు 8: పట్టణంలోని ఒకే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఇద్దరు మహిళల మధ్య వివాదం హత్యాయత్నానికి దారితీసింది. పోలీసుల కథనం మేరకు స్థానిక ఆర్టీసీ డిపోకు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో సురభిగాయత్రి, లెక్కల రాజేశ్వరి నివాసం ఉన్నారు. గాయత్రి కళ్లలో రాజేశ్వరి కారం కొట్టి కత్తితో విచక్షణంగా దాడి చేసింది. ఈ దాడిలో గాయత్రికి వీపు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆత్మకూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. దాడి అనంతరం రాజేశ్వరి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమెను కూడా వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ముత్యాలరావు పరిస్థితిని సమీక్షించి, స్థానికు లను అడిగి వివరాలు సేకరించారు. దాడికి ప్రధాన కారణం అక్రమ సంబంధమే అని ప్రాథమిక విచారణలో తేలినట్లు ఎస్ఐ ముత్యాలరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇల్లు గుల్లచేశారు

వెంకటేశ్వరపురంలో ఇంట్లో చోరీ

దాదాపు రూ.10లక్షల సొత్తు అపహరణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 8 : నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో గురువారం తెల్లవారుజామున ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. బాధితుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయ డెయిరీ విశ్రాంత ఉద్యోగి గోర్ల సుబ్బారావు వారం క్రితం ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి బెంగళూరులోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం ఇంటికి చేరుకునే సరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి, బీరువాలు అన్నీ తెరిచి ఉన్నాయి. దొంగలు పడినట్లు నిర్ధారించుకుని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. దాదాపు 15 సవర్ల బంగారు నగలతోపాటు 500 గ్రాముల వెండి సామాన్లు, రూ.20వేల వరకు నగదు కలిపి మొత్తం రూ.10లక్షల సొత్తు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

వరుస దొంగతనాలతో ప్రజలు హడల్

వెంకటేశ్వపురం ప్రాంతంలో వరుస చోరీలతో ప్రజలు హడలిపోతున్నారు. కొన్ని రోజుల క్రితం ఇదే ప్రాంతంలో దొంగలు ఓ ఇంట్లో చోరీ చేశారు. భగత్‌సింగ్‌కాలనీలోనూ తరచూ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. అయినా పోలీసులు రాత్రి గస్తీ నామమాత్రంగా నిర్వహిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఫలసరుకుల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్

కోవూరు, ఆగస్టు 8: స్థానిక మైథిలీ కూడలిలోని ఓ ఫలసరుకుల దుకాణంలో గురువారం షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటల్ని అదుపు చేశారు. సుమారు రూ. 6లక్షల మేర నష్టం వాటిల్లినట్లు దుకాణం యజమాని సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సోమశిలలో 13.853 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, ఆగస్టు 8: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారానికి 13.853 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలి పారు. ఎగువ నుంచి 10129 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



అవాంతరాలెన్ని ఎదురైనా

అడవే ఆధారం

- అభివృద్ధికి దూరంగా ఆదివాసీలు
- నిర్వీర్యమైపోయిన ఐటీడీఏ
- గతంలో ఎన్నో సంక్షేమ పథకాలు, రుణాలు
- ఐదేళ్లుగా దరిచేరని వైనం
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 8: జిల్లాలోని ఆదివాసీల మనుగడకు ఎన్నో అవాంతరాలు ఎదురవుతు న్నా, వారికి అభివృద్ధి ఫలాలు అందకున్నా అడవినే నమ్ముకొని వారు జీవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీలు అంతరించి పోతున్న తరుణంలో వారి సంరక్షణకు ఐక్యరాజ్యసమితి చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా ఆగస్టు 9న (నేడు) ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది. 1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు కల్పిస్తూ, ప్రపంచ దేశాల ప్రతినిధులు తీర్మానించారు. అప్పటి నుంచి గిరిజన హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

● వారిది స్వచ్ఛమైన జీవితం

గిరిజనుల స్వచ్ఛమైన జీవితాన్ని గురించి దేవులపల్లి కృష్ణశాస్త్రి ఓ సినిమా పాట కూడా రాశారు. ఆకులో ఆకునై.. పువ్వు లో పువ్వునై.. కొమ్మలో కొమ్మనై. నునులేత రెమ్మనై... ఈ అడవి దాగిపోనా..నేనెటులైనా ఇచటనే ఆగిపోనా..అన్నది ఆ పాట సారాంశం. ఈ పాట వారి జీవితాన్ని ప్రతిబింబిస్తోంది. అడవి అందాలను ఆస్వాదించాలని ఎవరికీ మాత్రం అనిపించదు.? పచ్చని చెట్ల నీడన సేదదీరాలని, గలగల పారే సెలయేటి నీటిని దోసిలి పట్టి తాగాలని, పక్షుల కిలకిలా రావాలను, పూల సుగంధాలను ఆస్వాదించాలని, చెట్టుపై మాగిన పండ్లను కోసి తినాలని... ఇలాంటి అనుభవం జీవితంలో ఒక్కటైనా ఉండాలని ఎవరను కోరు...? ఇంతటి స్వచ్ఛమైన జీవితం అనుభవించే ఆదివాసీలు సమాజ స్రవంతిలో కలవడానికి, ముందుకు సాగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.



బడికి దూరంగా గిరిజన బాలలు

● ఐదేళ్లుగా ఐటీడీఏ నిర్వీర్యం

జిల్లాలో ఐటీడీఏ కార్యాలయం ఉన్నా ఐదేళ్లుగా గిరిజనులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందటంలేదు. జిల్లాలో యానాదులు 4.55 లక్షలమంది, ఎరుకల వారు 65వేల మంది, లంబాడీలు 2500 మంది ఉన్నట్లు అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. నక్కలోళ్లు కూడా పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఐడీడీఏ నిర్వీర్యమై పోయింది. ఈ శాఖద్వారా గిరిజనులకు ఎలాంటి సబ్సిడీ పథకాలు అందలేదు. 2018లో టీడీపీ ప్రభుత్వ కాలంలో గిరిజనులకు ఇన్నోవా వాహనాలు, కార్లు, ఆటోలు తదితర వాహనాలను సబ్సిడీపై అందచేశారు. అంతేకాక పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలయ్యాయి. విరివిగా రుణాలు కూడా అందచేశారు. పలు స్వయం ఉపాధి పథకాలతో గిరిజనులు లబ్ధి పొందారు. అయితే ప్రస్తుతం ఐడీడీఏ కార్యాలయం పేరుకే ఉంది. ఆ కార్యాలయం ద్వారా తమకు ఎలాంటి రుణాలుకానీ, వాహనాలు కానీ అందటం లేదని గిరిజనులు వాపోయారు.

ఘనంగా నిర్వహిస్తున్నాం..



ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నాం. శుక్రవారం ఉదయం 9 గంటలకు నెల్లూరు బీవీనగర్‌లో ఉన్న గిరిజన భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఆనంద్‌తో పాటుగా, మంత్రులు, ప్రజాప్రతి నిధులు, గిరిజన సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. గిరిజన విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వారికి ఆధార్ కార్డులు కూడా ఈ సందర్భంగా పంపిణీ చేస్తాం.

- పరిమళ, ఇన్‌చార్జి ఐటీడీఏ, పీడీ

రుణాలు అందచేయాలి



ఐటీడీఏకి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేసి గిరిజనులకు ఇతోధికంగా రుణాలు అందచేయాలి. ఆధార్‌కార్డులు అందచేయాలి. 2018లో గిరిజనులకు అనేక ప్రభుత్వ పథకాల కింద రుణాలు అందేవి. 2019 నంచి 2024 వరకు ఎలాంటి రుణాలు అందలేదు.

- పులి చెంచయ్య, యానాదుల గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఆనంద్‌కు గురువారం యానాదుల గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి చెంచయ్య ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌లో నమోదులో గిరిజనులకు సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఎంపీడీవోల పర్యవేక్షణలో ఈ కార్డులు అందచేయాలని కోరారు. గిరిజనులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వడానికి ఐటీడీఏకు అనుమతినిచ్చిన కలెక్టర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ దాసరి పోలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు సామర్థ్యం పెంచుకోవాలి

● కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ భాస్కర్

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 : కళాశాలల్లో బోధన చేసే అధ్యాపకులు వారి సామర్థ్యాలను మరింత పెంపొందించుకోవాలని కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ సూచించారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సోషల్ ఎమోషనల్ లెర్నింగ్(సీక్), సెల్ఫ్ డైరెక్టర్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపతి అండ్ కైండ్‌నెస్(సెల్) అనే అంశాలకు సంబంధించిన వర్క్‌షాప్‌ను కమిషనర్ వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో భావోద్వేగాల నియంత్రణకు భాషా అధ్యాపకులు కృషి చేయాలని కోరారు. యునెస్కో రూపొందించిన సెల్ అండ్ సీక్ వర్క్‌షాప్‌లో అధ్యాపకులు సదరు సామర్థ్యాలను పెంపొందించుకుని తరగతి గదిలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని సూచించారు. ఐదురోజులు నిర్వహించే ఈ శిక్షణలో ఆధునిక విద్యా విధానానికి అనుగుణంగా తెలుగు, హిందీ, ఉర్దూ అధ్యాపకులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా జాతీయ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ రీచా బన్సల్, సొనాలిఛ్చేద రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. మాస్టర్ ట్రైనర్స్‌గా శిక్షణ పొందిన డాక్టర్ సువర్ణ, డాక్టర్ సుజాత, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ మహబూబ్, డాక్టర్ విజయ్‌కుమార్ శిక్షణ తరగతులు నిర్వహించారు. కోఆర్డినేటర్ డాక్టర్ కే కరుణశ్రీ, వివిధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వర్చువల్ సదస్సుకు హాజరైన కళాశాల ప్రతినిధులు

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

ఘనంగా నిర్వహించాలి

● నెల్లూరు ఆర్డీవో మలోల



మాట్లాడుతున్న ఆర్డీవో మలోల

వెంకటాచలం, ఆగస్టు 8: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఈనెల 18 నుండి 24వ తేదీ వరకు జరగనున్నాయని, సంబంధిత అధికారులు సమిష్టిగా కలిసి ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని నెల్లూరు ఆర్డీవో ఏ మలోల కోరారు. గురువారం వెంకయ్యస్వామి ఆశ్రమంలో 42వ ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుండి వారం రోజులపాటు జరిగే వెంకయ్యస్వామి ఆరాధన బ్రహ్మోత్సవాలకు లక్షలాది మంది ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. దేవాలయంలో స్వామి వారి దర్శనం, అన్నదానం కేంద్రాల వద్ద భక్తుల రద్దీని నియంత్రించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. నెల్లూరు ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్ల నుంచి గొలగమూడి ఆశ్రమం వరకు భక్తులకు ప్రత్యేక రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా ఆర్టీసీ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసి అత్యవసర మందులతోపాటు అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంచాల్సిందిగా వైద్యాధికారులకు సూచించారు. వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, డీపీవో సుస్మిత, రవాణా శాఖాధికారి పూర్ణచంద్రరావు, సీఐ సుబ్బారావు, వివిధ శాఖలాధికారులు ఉన్నారు.

బహిరంగ మద్యపానంపై తనిఖీలు

నెల్లూరు,(క్రైం): బహిరంగ ప్రదేశాల్లో, కూల్‌డ్రింక్స్ దుకాణాల్లో మద్యం సేవించడాన్ని అరికట్టేందుకు గురువారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏ రేఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలకు పక్కగా ఉన్న షాపుల్లో వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు, మాత్రమే విక్రయించాలని, మద్యం సేవించేందుకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు కలెక్టరేట్‌లో

మంత్రి నారాయణ అర్జీల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 8 : నెల్లూరులోని ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో శుక్రవారం రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అర్జీలు స్వీకరించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. మంత్రితోపాటు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సూర్యతేజ పాల్గొంటారు. ఇప్పటికే మంత్రి నారాయణ నెల్లూరు నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చాలా వరకు దరఖాస్తులను పరిష్కరించిన విషయం విదితమే.

శ్మశానంలో బాడీ స్ట్రక్చర్ అపహరణ

కోవూరు, ఆగస్టు 8: శ్మశానంలోని బాడీ స్ట్రక్చర్‌ను అపహరించిన ఘటన మండల పరిధిలోని పోతిరెడ్డిపాళెంలో గురువారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపాళెం గ్రామంలో ఇటీవలి కాలంలో దొంగల బెడద ఎక్కువైంది. దీంతో గ్రామస్థులు రాత్రి సమయంలో గుంపులు గుంపులుగా పహరా కాస్తూ దొంగల కోసం గాలిస్తున్నారు. ఈనేపథ్యంలో దిక్కుతోచని దొంగలు ఏకంగా శ్మశానంలో శవాల్ని కాల్చేందుకు ఉపయోగించే ఇనుప 'బాడీ స్ట్రక్చర్‌'ను బుధవారం రాత్రి అపహరించుకుని వెళ్లారు. మద్యానికి బానిసలైన దొంగలే అపహరించి ఉండొచ్చునని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని గ్రామస్థులు తెలిపారు.

స్వర్ణభారత్ ట్రస్టుకు చేరుకున్న వెంకయ్య

వెంకటాచలం, ఆగస్టు 8: పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈనెల 10న స్వర్ణభారత్ ట్రస్ట్ అడ్మిన్ బ్లాక్ పూజ కార్యక్రమాల్లోనూ, 15న అక్షర విద్యాలయంలో జరిగే స్వాతంత్ర సంబరాల్లోనూ ఆయన పాల్గొంటారు. అనంతరం ఈనెల17న ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌తో కలిసి స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ సేవా ప్రస్థానంలో కూడా పాల్గొనున్నారు. ఈనెల19 వరకు జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో వెంకయ్య పాల్గొనున్నారు.

తల్లికి బాలుడి అప్పగింత

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 8 : ఇంటి నుంచి పరారైన బాలుడిని గుర్తించిన పోలీసులు తల్లికి అప్పగించారు. పోలీసుల సమాచారం మేరకు... గుంటూరు నగరంలో రమ కుటుంబం నివసిస్తోంది. ఆమె కుమారుడు స్థానికంగా ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతు న్నాడు. ఆ బాలుడు సెల్‌ఫోనుకు బానిసయ్యాడు. బుధవారం ఇంటి నుంచి పారిపోయాడు. అర్ధరాత్రి నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉండగా బీట్ కానిస్టేబుళ్లు గమనించి బాలుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో గురువారం తల్లి నెల్లూరుకు చేరుకుంది. చిన్నబజారు పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు.

రైల్వే డీఆర్ఎం దృష్టికి

బిట్రగుంట, కావలి రైల్వే అభివృద్ధి పనులు

కావలి, ఆగస్టు 8: నియోజకవర్గంలోని బిట్రగుంట, కావలి రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై విజయవాడలోని రైల్వే డీఆర్ఎం నరేంద్ర పాటిల్‌ను గురువారం బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరు వెంకటసత్యనారాయణ కలిశారు. బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలోని 900 ఎకరాల భూమిలో ఎలాంటి ప్రాజెక్టులు చేట్టాలనే దానిపై చర్చించారు. రైల్వే మంత్రి నుంచి అనుమతులు పొందితే ప్రయివేట్, పబ్లిక్ పద్ధతులలో వాటిని ఏర్పాటు చేసుకోవచ్చని డీఆర్ఎం తెలి పారని కందుకూరి చెప్పారు. అలాగే కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ నిర్మాణం జాప్యంపై చర్చించారు.



రైల్వే డీఆర్ఎంను కలిసిన బీజేపీ నేత కందుకూరి

సూరాయపాలెం ఇసుక రీచ్‌లో సర్వే

పొదలకూరు, ఆగస్టు 8 : ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేసే పథకంలో భాగంగా పొదలకూరు మండలంలోని సూరాయపాలెం వద్ద ఉన్న పెన్నానదిలో డ్రెడ్జింగ్ విధానంలో ఇసుక సేకరణకు రీచ్‌కు అనుమతిం చింది. అందులో భాగంగా గురువారం నెల్లూరు ఆర్డీవో మాలోలా, మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దారు సారంగపాణి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, జలవనరుల శాఖ సహాయ ఇంజనీరు రవికుమార్ రీచ్‌లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సారంగపాణి మాట్లాడుతూ పెన్నానదిలో డ్రెడ్జింగ్ విధానంలో ఐదు లక్షల ఘనపు మీటర్లు సర్వే పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఇసుక డంపింగ్ యార్డు కోసం ఒక రైతుకు చెందిన రెండున్నర ఎకరాల భూమిని గుర్తించామన్నారు.



ఇసుక రీచ్‌లో పనులు పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	93
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6546
వెండి కిలో ధర	రూ. 81,000
వెండి ఒక గ్రాము	రూ. 83.00

ఇంట్లో నిద్రిస్తుండగానే దోచేశారు

- రూ.2.30 లక్షల నగదు చోరీ
- అదే వీధిలో మరో ఇంట్లోనూ..



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 8: నెల్లూరులోని ప్రముఖ ఆటోమొబైల్ షోరూమ్ యజమాని నరేంద్రనాథ్ నివాసంలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అదే వీధిలో మరో ఇంట్లోనూ దొంగతనానికి పాల్పడగా గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దుండగులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... నగరంలోని దర్గామిట్ట ప్రాంతంలో గల సీఎస్ నగర్‌లో నరేంద్రనాథ్ కుటుంబం నివసిస్తోంది. బుధవారం రాత్రి ఆయన కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లోని పడకగదిలో నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగలు మెయిన్‌డోర్‌ను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. కప్‌బోర్డులోని రూ.2.30 లక్షల నగదును అపహరించుకుని వెళ్లారు. ఉదయం నిద్రలేచిన కుటుంబసభ్యులు ఇంటితలుపులు తెరిచి ఉండటం, కప్‌బోర్డులోని నగదు కనిపించకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్గామిట్ట ఇన్‌చార్జి ఎస్ఐ బీ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసిన పోలీసులు తెలిసిన వారే దొంగతనానికి పాల్పడ్డారన్న కోణంలో విచారణ చేస్తున్నారు.



దొంగ ఇంట్లోకి వస్తుండగా సీసీ కెమెరాలో రికార్డయిన చిత్రం

తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

అనంతసాగరం, ఆగస్టు 8: విద్యార్థులపై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలని ఏపీసీడబ్ల్యూ శ్రీదేవి తెలిపారు. రేవూరు బీసీ బాలికల వసతిగృహంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారికి సూచనలిచ్చారు. సెలవుల సమయంలో ఇంటికి వచ్చిన విద్యార్థులు శ్రద్ధగా చదువుకొనేలా ప్రోత్సహించడంతో పాటు, సకాలంలో వారిని హాస్టల్‌కు పంపిచేలా చొరవ చూపాలన్నారు. వసతిగృహంలో వసతులు, భోజన ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగార్జున్‌రెడ్డి, కే రవీంద్రరెడ్డి, సంక్షేమాధికారి మల్లేశ్వరి పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

సీతారామపురం, ఆగస్టు 8: నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కృషి అభినందనీయమని పార్టీ రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 4వేల క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. అందుకు సహకరించిన జనసైనికులకు, వీర మహిళలు, వాలంటీర్స్ టీమ్, ఐటీ విభాగం టీంకు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 36వేల పార్టీ సభ్యత్వాలు నమోదయ్యేలా ప్రణాళికలు చేశామన్నారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును గురువారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సేవాసంస్థలను భాగస్వామ్యం చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య, సభ్యులు పీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, వెంకటశ్రీనివాస్ ఉన్నారు.

ఇంటింటా సర్వే చేపట్టాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: జలజీవన్ మిషన్ పల్స్ సర్వేలో భాగంగా ఇంటింటికీ తిరిగి కొళాయి ఉందా లేదా గుర్తించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్ తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 31వ తేదీ వరకు సచివాలయ సిబ్బంది సర్వే చేపట్టి వివరాలు యాప్‌లో నమోదు చేయాలన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: తిరుమలాపురం పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని సర్పంచ్ కొల్లుబోయిన సంజయ్‌కృష్ణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీలో రెండేళ్లుగా ఇంటి పన్నులు వసూలు చేసిన దాఖలాలు లేవని వాపోయారు. ఈ సమస్యతో అభివృద్ధి పనులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. విషయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: పట్టణానికి చెందిన మన ఫౌండేషన్ సభ్యులు రంతుజానీ, టీడీపీ నాయకుడు బాబుల తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గురువారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 8: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవోగా పద్మావతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతసాగరం ఐసీడీఎస్ సీడీపీవోగా పని చేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు ఉదయగిరికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ఉదయగిరి రూరల్: అన్ని పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుక రావాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తెలిపారు. గురువారం ఆమె ఆర్లపడియలో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల ప్రారంభం

అల్లూరు, ఆగస్టు 8 : గ్రామ పంచాయతీల అభివృద్ధి అంశాలపై కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించనున్న శిక్షణా తరగతులు గురువారం ప్రాంభమయ్యాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన శిక్షణ తరగతులను ఎంపీడీఓ జ్యోతి ఆధ్వర్యంలో కావలి ఆర్డీవో శీనానాయక్, తహసీల్దారు లక్ష్మీనారాయణ పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రాన్ని ఉద్దేశించి ఆర్డీఓ మాట్లాడారు. ప్రతిగ్రామం అభివృద్ధి చెందాలంటే ముందుగా కార్యదర్శులు, సర్పంచ్‌లు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై సమగ్రంగా అవవగాహన పొందితే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, సర్పంచ్‌లు ఆట తిరుమల పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులకు శ్రీకారం


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఫజులుల్లా

ఆత్మకూరు, ఆగస్టు 8: మున్సిపాలిటీకి మంజూరైన రూ.22.81లక్షల జీపీఎస్ నిధులతో పట్టణ పరిధిలోని 91.10కిలోమీటర్ల మురుగునీటి కాలువ పూడికతీత పనులు చేపడుతు న్నట్లు కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. గురువారం ఆయన ప్రజాప్రతినిధులతో కలిసి పనులను పరిశీలించి మాట్లాడారు. అనంతరం 15వ వార్డులో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ ఛైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టీడీపీ నాయకులు తోడేటి వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో యాజమాన్య కమిటీల ఎన్నిక

సంగం, ఆగస్టు 8: మండలలోని 48 ప్రాథమిక పాఠశాలల్లో 5ఏకగ్రీవంగా కాగా మిగిలిన వాటిలో ఎన్నికలు జరిగాయి. ఒక్క గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య చిన్న వివాదం నెలకొంది.

సీతారామపురం: 40 ప్రాథమిక పాఠశాలలు, 4ఉన్నత పాఠశాలు, కేజీబీవీ, ఏపీ మోడల్‌స్కూల్‌లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి తెలిపారు.

ఆత్మకూరు: మండలంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం హర్షనీయమని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి ఉన్నారు.

చేజర్ల: 46 ప్రాథమిక , 6 ఉన్నత, ఒక గురుకుల పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 851మంది కమిటీ సభ్యులుగా, 59మంది ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

అనంతసాగరం: మండలంలో పాఠశాలలో విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. సోమశిల ఉన్నత పాఠశాలలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొనడంతో పోలీసులు జోక్యంతో సమస్య సద్దుమణిగింది.

వరికుంటపాడు: 46ప్రాథమిక, 4ప్రాథమికోన్నత, 8ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా 53పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఛైర్మన్లను ఎన్నుకున్నారు. నార్తుకొండాయపాళెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. తూర్పు బోయమడగల, జంగంరెడ్డిపల్లి, మహమ్మదాపురం పాఠశాలల్లో కోరం వాయిదా వేశారు.

ఉదయగిరి రూరల్: మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. 60 పాఠశాలల్లో 57 పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయన్నారు. గండిపాళెం గురుకుల, మెయిన్, వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయన్నారు. అనంతరం ఛైర్మన్లు, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించి తొలి సమావేశాన్ని నిర్వహించారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు


నందిపాడు సెంటర్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 8: రాష్ట్రంలో వైసీపీ నాయకులపై దాడులు అధికమయ్యాయని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మెల్సీ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు అన్నారు. నందిపాడు సెంటర్‌లో మండ్ల వెంకటేశ్వర్లకు చెందిన తొలగించిన ఇళ్లు, రేకులషెడ్లు, చెట్లను గురువారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. వైసీపీ నాయకుడి ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమ న్నారు. కొత్తపేట తిరుపాలు నాయుడికి రూ.50వేల చెక్కును అందజేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా కలిగిరి సీఐ వెంకటనారాయణ, దుత్తలూరు, ఉదయగిరి ఎస్‌ఐలు ఉమాశంకర్, ఇంద్రసేనారెడ్డిలు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు గణపం బాలకృష్ణారెడ్డి, మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఉన్నారు.

టీడీపీ నాయకులు కూల్చారని చెప్పడం అవాస్తవం

● నందిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న గురవారెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఆగస్టు 8: నందిపాడు సెంటర్‌కు చెందిన మాజీ హోంగార్డు మండ్ల వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు, చెట్లు, రేకుల షెడ్లు టీడీపీ నాయకులు కూల్చారని చెప్పడం అవాస్తమని నందిపాడు మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉండేలా గురవారెడ్డి అన్నారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడా రు. వెంకటేశ్వర్లు ఓ వ్యక్తి వద్ద 90 సెంట్ల భూమిని కొనుగోలు చేసి అతనికి డబ్బులు చెల్లిం చకపోవడంతో వివాదం తలెత్తిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్షలు స్వాహా చేశాడన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియోజవకర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగో పాల్‌రెడ్డి అండతో వెంకటేశ్వర్లు అనేక అక్రమాలు, అరాచకాలు పాల్పడ్డారని చెప్పారు. వాట న్నింటిపై సీబీడీ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మండవ మధు, శింగవరపు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, కనసాని సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ జెండాతో కావలికి ప్రత్యేక గుర్తింపు: ఎమ్మెల్యే


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 8: పట్టణ ట్రంకు రోడ్డులో ఏర్పాటు చేయనున్న 100అడుగుల జాతీయ జెండా, మహనీయుల చిత్రపటాలతో కావలికి ప్రత్యేక గుర్తింపు రానుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందేలా కావలి ప్రజలకు ఆహ్లాదం అందించే సెల్ఫీ పాయింట్ లా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 15న దీన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

టీబీ రహిత సమాజం కోసమే వ్యాక్సినేషన్

● రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర


బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న టీబీ రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర

కావలిటౌన్, ఆగస్టు 8: టీబీ రహిత సమాజం కోసమే బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రం అని టీబీ రాష్ట్ర విభాగం ఏపీవో రవీంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్, పుల్లారెడ్డినగర్, బొమ్మారెడ్డి వీధిలోని టీడీ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని టీబీ జిల్లా అధికారి, అడిషన్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలితో కలిసి ఆయన పర్యవేక్షించారు. దేశంలో టీబీని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వం ధ్యేయంగా పని చేస్తుందని అందులో భాగంగానే వ్యాక్సినేషన్ ప్రక్రియను పడడ్బందీగా అములు చేస్తుందన్నారు. ప్రభుత్వమే ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి దీర్ఘకాలం మందులు, పౌష్టికాహారం, ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం

సంగం, ఆగస్టు 8: మండల తహసీల్దారు సోమ్లానాయిక్‌ను గురువారం జనసేన నియోజకవర్గ పార్టీ ఉపాధ్యక్షులు భాను కిరణ్, చిరంజీవి, మండల యూత్ అధ్యక్షులు కృష్ణమోహన్‌కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఉదయగిరి రూరల్: తహసీల్దారు సుభద్రను టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్ కలిసి సన్మానించారు.

ఆత్మకూరు: టీడీపీ రూరల్ అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి, ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డిలు నూతన తహసీల్దారు సుధీర్‌ను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు బాబునాయుడు, మద్దినేని నారాయణ, చంద్రా మల్లికార్జున నాయుడు, ఎన్.పెంచలనాయుడు, కొండ్రెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఆత్మకూరు, ఆగస్టు 8: వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి పుట్టా సత్యవాణి తెలిపారు. గురువారం కరటంపాడులో వరిపైరును పరిశీలించారు. అనంతరం రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి ఈ క్రాప్ నమోదు తెలుసకున్నారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతి

సీతారామపురం: తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి సింగాల నాగేశ్వరావు, జడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, శ్రీకుర్తి రవీంద్రబాబుతో కలిసి గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. మండల తాగునీటి సమస్య, సిమెంట్ రోడ్లు, మురుగుకాలువల సమస్యలపై చర్చించారు. మండలానికి అన్న క్యాంటీన్ కావాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారిని గుర్తించాలని కోరినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు


కావలి పట్టణ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సీఎంసీ సభ్యులు

కావలి టౌన్, రూరల్, ఆగస్టు 8: మండలంలోని 120 పాఠశాలలకు 106 ఏకగ్రీవం కాగా 14 పాఠశాలల కమిటీలకు ఎన్నికలు జరిగాయి. పట్టణ పరిధిలోని జెడ్పీ బాలుర, బాలికల, ముసునూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 8వ వార్డు, వెంగళరావునగర్, పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, విశ్వోదయ బాలుర, బాలికోన్నత ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు, 3 అప్పర్ ప్రైమరీ, 12 ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఎన్నికలు ఏకగ్రీవమైనాయి.

జలదంకి : మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలకు గురువారం ఎంఈఓలు శ్రీధర్, నాగేశ్వరరావుల పర్యవేక్షణలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు జరిగాయి. ఒక్క రామవరప్పాడు మెయిన్ పాఠశాలలో 4, 5 తరగతులకు కోరం లేక ఎన్నిక జరగకపోవడంతో ఎస్ఎంసీ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 58పాఠశాలల్లో ఛైర్మన్, సభ్యుల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ ఆదిలక్ష్మీ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కొండాపురం: మండలంలోని 66 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరగాల్సి ఉండగా గురువారం 65 పాఠశాలల్లో పూర్తయినట్లు మండల విద్యాశాఖాధికారి కె.రవికుమార్ తెలిపారు. నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల హాజరుశాతం తగ్గడంతో ఎన్నిక ఆగిపోయింది. ఎన్నికైన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్యులతో హెచ్‌ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు.

చిట్రగుంట, (దగదర్తి): బోగోలు మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో 54 పాఠశాలలు ఎన్నికలు ఏకగ్రీవం అవగా బోగోలు, చిట్రగుంట పాఠశాల్లో ఎన్నికలు జరిగాయి. ఎస్సీ పాలెం పంచాయతీలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల్లో ఏకగ్రీవానికి అంగీకరించక పోటీ నిర్వహించగా సరిసమానంగా రావడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలు తెలిపారు. అదేవిధంగా దగదర్తి మండలంలోని 57 పాఠశాలల్లో కమిటీ ఛైర్మన్ ఎంపికలు ఏకగ్రీవం అయినట్లు ఎంఈవో భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల కమిటీ ఎన్నికలో ఏకగ్రీవమైన ఛైర్మన్ వైస్‌ఛైర్మన్ సభ్యులను గురువారం టీడీపీ మండల యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు అభినందించారు. కార్యక్రమంలో మాలేపాటి సుధాకర్ నాయుడు, కంచర్ల కృష్ణ, వెంకటేశ్వర్లు, వట్టిగుంట గోపాల్, వడ్డే వినయ్‌కుమార్, ముపాళ్ళ సురేష్ ఉన్నారు.

లింగసముద్రం: మండలంలో గురువారం అన్ని పాఠశాలల్లో జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికలలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను టీడీపీ మద్దతుదారులు కైవశం చేసుకున్నారు. అయితే మొగిలిచెర్ల గ్రామంలోని మెయిన్ పాఠశాలలో కోరం లేక ఎన్నిక నిలిచిపోయింది. ఈ ఎన్నికలను టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ ముప్పరాజు వెంకటేశ్వర్లు, ఎ రంగయ్య, గాలంకి ప్రసాద్, చిన కొండయ్య పర్యవేక్షించారు.

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లె, బంగారక్కపాలెం, చెర్లోపాలెం గ్రామాలలోని పాఠశాలలు మినహా మిగిలిన 48 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్‌లో కోరంలేక ఎన్నిక నిలిచిపోయింది. బంగారక్కపాలెంలో కోదండరామస్వామి ఉత్సవాలు సందర్భంగా ఎస్‌ఎంసీ ఎన్నికలకు గ్రామస్థులు రాకపోవడంతో ఎస్‌ఎంసీ ఎన్నిక నిలిచిపోయింది. చెర్లోపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ప్రమాణ స్వీకారం చేయని సందర్భంగా ఎన్నిక నిలిచిపోయినట్లు ఎంఈఓ రవికుమార్ తెలిపారు.

కందుకూరు: ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకమిటీల ఛైర్మన్‌ల ఎంపిక జరిగింది. కందుకూరు పట్టణ 28వ వార్డు అమలనాధుని పాలెం మండల పరిషత్ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్‌గా పాశం శ్రీను, వైస్ ఛైర్మన్‌గా సిరిగిరి దుర్గమ్మ, కమిటి సభ్యులను ఎన్నుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిణి తెలిపారు. అదేవిధంగా మహదేవపురం ఆదిఆంధ్ర కాలనీ ఎంపీ యూపి జనరల్ స్కూల్ ఛైర్మన్‌గా చదలవాడ దావీదు, వైస్ ఛైర్మన్‌గా పోట్లూరి భవానిలను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు.


మొగిలిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో ఎన్నికైన ఎస్‌ఎంసీ నూతన కార్యవర్గం


జలదంకి: తిమ్మసముద్రం ఎస్‌ఎంసీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు


కొండాపురం : సాయిపేటలో సభ్యుల ప్రమాణ స్వీకారం

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ నియామకం


ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బీవీ పవన్, శ్రీనివాసులు

కందుకూరు, ఆగస్టు 8 : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ నియామకం చేపట్టినట్లు ఆసుపత్రి సూరింటెండెంట్ జీ హరీష్ తెలిపారు. కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ప్రథమ ప్రాధాన్యత సభ్యులుగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కమిటి సభ్యులుగా చాగొల్లు గ్రామానికి చెందిన వర్షినేని శ్రీనివాసులు, ఉలవపాడుకు చెందిన దంతవైద్యులు డాక్టర్ బీవీ పవన్, సన్నెబోయి ప్రభావతితోపాటు ఎంపీడీవో ఎస్ విజయ, పంచాయతీ కార్యదర్శి బీ విజ యమ్మ, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జీ హరీష్‌లో కమిటీ ఏర్పడినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా మెడికల్ ఆఫీసర్ హరిష్, కమిటీ సభ్యులు పవన్, శ్రీనివాసులు గురువారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రోగులకు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్వరమే వైద్య సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు.

అనుమతికి మించి పొగాకు సాగు శ్రేయస్కరం కాదు

● బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు

కందుకూరు, ఆగస్టు 8: పొగాకు బోర్డు అనుమతికి మించి పంట పండించడం, అనధికార బ్యారన్‌ల నిర్మాణాలు పొగాకు రైతులకు శ్రేయస్కరం కాదని బోర్డు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. గురువారం ఆయన కందుకూరు వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం తీరును పరిశీలించారు. అనంతరం కొత్తగా నిర్మించిన పరిపాలన భవనాన్ని, ఆధునీకరించిన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరను దృష్టిలో పెట్టుకొని అధిక ధరలకు పొలాలు, బ్యారన్‌లు కౌలుకు తీసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సెక్రటరి శ్రీదివి వేణుగోపాల్, రీజనల్ మేనేజర్ శ్రీలక్ష్మణరావు, రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి కే రాజగోపాల్‌రెడ్డి, రైతు నాయకులు, రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ మంచినీటి పథకాల నిర్వహణ టీడీపీ నేతలకు అప్పగింత

లింగసముద్రం, ఆగస్టు 8 : రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే భారీ మంచినీటి పథకాల నిర్వహణను కందుకూరు గ్రామీణ నీటి పథకం డీఈ రామ్మోహన్‌రావు, ఏఈ సీహెచ్ రాజశేఖర్‌లు టీడీపీ నేతలకు అప్పగించారు. లింగసముద్రం, వలేటివారి మండలాల్లోని గ్రామాలకు మంచినీటిని అందించే రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకాన్ని లింగసముద్రంలోని టీడీపీ నేతలు అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అర్థాకుల సత్యంలకు, అలాగే లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని గ్రామాలకు మంచినీటిని అందించే గుడ్లూరు మంచినీటిని పథకాన్ని గుడ్లూరు టీడీపీ నేత జె నాగరాజుకు అప్పగించారు. అయితే లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లోని గ్రామాలకు నీరందించే చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకం నిర్వహణను ఇంకా టీడీపీ నేతలకు అప్పగించలేదని సమాచారం. త్వరలో ఈ పథకాల నిర్వహణకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు.

ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలి: డీఎఫ్‌వో

ఉలవపాడు, ఆగస్టు 8 : మండలంలోని చాకిచర్ల, పెదపట్టపుపాలెం అటవీ భూముల్లో అక్రమంగా ఇసుక రవాణా జరగుతుందని గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తపై జిల్లా అటవీశాఖ అధికారి ఏ చంద్రశేఖర్ స్పందించారు. సంఘటనా ప్రాంతాలను సందర్శించి సమగ్ర విచారణ చేపట్టి అక్రమ ఇసుక రవాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీఎఫ్‌వో కావలి రేంజ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డికి ఆదేశాలు జారిచేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీ భూముల్లో ఇసుక తలిస్తు పట్టుబడిన ట్రాక్టర్, టైరుబండ్లులపై కేసులు నమోదుచేసి ప్రభుత్వ పరం చేస్తామని, దీనికోసం చర్యలు, నిఘా చేపడతామని కావలి రేంజ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డి వివరణ ఇచ్చారు.

అర్హులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలి

కావలి, ఆగస్టు 8: స్థానిక పురపాలక సంఘంలో 2016నుంచి దినసరి కూలీలుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2016 నుంచి 52 మంది దినసరి పారిశుధ్య కార్మికులుగా మున్సిపాలిటీలో పని చేస్తుంటే వారిని అనర్హులను సిఫార్సుల మేరకు చేర్చుకోవటం తగదన్నారు. ఆప్కాస్‌లో చేర్చుకునేందుకు కొందరి మధ్యవర్తులతో నగదు అధికారుల వద్దకు చేరినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. 2024 మార్చిలో అర్హతలేని 27 మందిని ఆప్కాస్‌లో కనబర్చినట్లు తెలిపారు. వారిలో ఇద్దరు మినహా మిగతా వారంతా బయటవారేనన్నారు. దినసరి పారి శుధ్య కార్మికులుగా పనిచేస్తున్న 52మందిని ఆప్కాస్‌లో చేర్చుకోవాలని గతంలో కౌన్సిల్ తీర్మానం చేసినా దానిని అమలు చేయకుండా డబ్బులు ఇచ్చిన వారికే అవకాశాలు కల్పించటం బాధాకరం అన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా ఒక నెల జీతాలు, 2024 జనవరి, ఫిబ్రవరి నెలలకు సంభందించి హెల్త్ అలవెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లె అంకయ్య, జిల్లా కార్యదర్శి గుంజి క్రిషోర్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సహాయ కార్యదర్శి ప్రభావతి, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి ఎండ్లూరి రవి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

అల్లూరు, ఆగస్టు 8 : అల్లూరు సచివాలయం-4లో గురువారం నిర్వహించిన ఆధార్ కేంద్రాన్ని కావలి ఆర్డీవో శీనానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధార్ కార్డుల్లో ఉండే పొరపాట్లను సవరించుకోవడం, నూతన ఆధార్ కార్డులు నమోదు చేసుకునేందుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీ నారాయణ, కమిషనర్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

శీలం అమరనాథ్‌కు డాక్టరేట్


శీలం అమరనాథ్

కందుకూరు, ఆగస్టు 8: కందుకూరు పట్టణంలోని బృందావనంకు చెందిన శీలం అమరనాథ్‌కు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల బోధనా శైలిపై ఆయన చేసిన పరిశోధనా గ్రంథానికి గాను ఆయనకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఈ పరిశోధనలో ఆయనకు మార్గదర్శనం చేసిన డాక్టరు హసన్‌కు అమరానాథ్ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరేట్ సాధించిన అమరనాథ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

నేడు గుడ్లూరు మండల సమావేశం

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడివో వై వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా గ్రామాల వివరాలతో సకాలంలో హా జరుకావాలని ఎంపిడివో కోరారు.

రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : యూటీఎఫ్

గుడ్లూరు, ఆగస్టు 8: ఉపాధ్యాయ యూనియన్ ఏపీ యూటీఎఫ్ సంఘం ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం ఎంఈవో కార్యాలయం ప్రాంగణంలో గుడ్లూరు యూటిఎఫ్ మండల శాఖ, కావలి రొటరీ క్లబ్ బృందం కలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మక్కెన రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు శిక్షణ

వలేటివారిపాలెం, ఆగస్టు 8 : మండలంలోని పోకూరు రైతు సేవా కేంద్రంలో కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం ఏఓ హేమంత్ భరత్ కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, వివేక్, మయాక్, కందుకూరు సాంకేతిక వ్యవసాయ అదికారి దురా మరియు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీ దుకాణాన్ని తగులబెట్టిన దుండగులు

కందుకూరు: స్థానిక అంకమ్మ తల్లి దేవాలయం ఎదురుగా ఉన్న మునగాల కృష్ణారెడ్డికి చెందిన టీస్టాల్‌ను బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తగులపెట్టారు. ఈ సంఘటనలో టీ దుకాణంలోని విలువైన సామాగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి.గురువారం డీఎస్పీ ఏ శ్రీనివాస్, సీఐ నఫీస్ బాషా స్థలంకు చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ శాఖ అధికారుల దాడులు

కందుకూరు, ఆగస్టు 8 : పట్టణంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు కట్టా వెంకటేశ్వర్లు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్(డీపీఈ), డీఈ ఏ వీరయ్యల ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. 32 బ్యాచ్‌లుగా ఏర్పడిన విద్యుత్ శాఖ సిబ్బంది టౌన్‌లోని 2841 సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. 225 సర్వీసుల వినియోగదారులు అదనపు లోడు వాడుకున్నవారికి రూ. 9 లక్షలు, ఒక కేటగిరి తీసుకొని వేరొక కేటగిరి కింద వాడుకుంటున్న 4 సర్వీసుల వినియోగదారులకు రూ.25 వేలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో కందుకూరు డివిజన్‌లోని ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు, 10 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

శాంతి భద్రతలను పరిరక్షిస్తాం

కలిగిరి, ఆగస్టు 8: శాంతి భద్రతల పరిరక్షణలకు తగు చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలో కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల పరిధిలో అక్రమ మద్యం, పేకాట, కోడిపందేలు వంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అరకొర వసతులతో మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం

● సముదాయంలోకి వెళ్లేందుకు వ్యాపారుల విముఖత


నిరుపయోగంగా ఉన్న ముత్తుకూరు మార్కెట్ సముదాయం

ముత్తుకూరు, ఆగస్టు 8: లక్షలు వెచ్చించి నిర్మించిన చేపలు, చికెన్ మార్కెట్ సముదాయం అరకొర వసతుల కారణంగా నిరుపయోగంగా మారింది. ముత్తుకూరు కూడలిలో ఉన్న పంచాయతీ స్థలంలో చికెన్, చేపల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగించారు. అయితే ఈ స్థలంలో మార్కెట్ సముదాయం నిర్మించాలని దుకాణాలను తొలగించారు. దీంతో వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అప్పటి మంత్రి సోమిరెడ్డి చొరవతో నిధులు మంజూరు చేయించి మార్కెట్ సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్కెట్ నిర్మాణానికి చాలారోజులు మోక్షం కలగలేదు. దీంతో చికెన్ వ్యాపారస్తులు రోడ్డుపైనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగించాల్సి వచ్చింది. మార్కెట్ నిర్మాణం కోసం డిమాండ్ పెరగడంతో మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీతో మాట్లాడి నిర్మాణ వ్యయాన్ని రూ.50లక్షలకు పెంచి నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తయ్యాయి అనిపించారు. కాగా, మార్కెట్ సముదాయంలో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకూ పనికిరావన్న అభిప్రాయం వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సెంటర్‌లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని, కొత్తగా నిర్మించిన సముదాయం లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు అక్కడికి వచ్చే అవకాశం లేదని, రోజువారి చేపలు, చికెన్ అమ్ముకుని జీవనం సాగించే తాము వ్యాపారం లేకపోతే తమ పరిస్థితి ఏమిటని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్లే కొత్తగా నిర్మించిన మార్కెట్ సముదాయంలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడంలేదు. అంతేకాకుండా రూ.50లక్షలతో నాసిరకంగా నిర్మించారని, లక్షల రూపాయల నిధులు వైసీపీ నాయకులు స్వాహా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మత్స్యకారుల కోసమే మార్కెట్ సముదాయం నిర్మించామని వైసీపీ నాయకులు చెబుతున్నా మత్స్యకార మహిళలు అందులోకి వెళ్లడానికి సిద్ధంగా లేరు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో సత్తాచాటిన టీడీపీ


విడవలూరు హైస్కూల్ చైర్మన్‌గా ఎన్నికైన సుబ్రహ్మణ్యంను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

విడవలూరు, ఆగస్టు 8: పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ సత్తాచాటింది. మండలంలోని సుమారు 64 పాఠశాలలకు గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విడవలూరు హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్‌గా టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం నాయకులు బలపరిచిన కె సుబ్రహ్మణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు చెముకుల కృష్ణచైతన్య, పాశం శ్రీహరిరెడ్డి, మాతూరు శ్రీనివాసులురెడ్డి, సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు చైర్మన్‌ని అభినందించారు. అలాగే ముదివర్తి, ఊటుకూరు, రామతీర్థం, అన్నారెడ్డిపాళెం, అలగానిపాడు, దండిగుంట విద్యాకమిటీ చైర్మన్ ఎన్నికల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సాయి ప్రసాద్ పర్యవేక్షించారు.

●**కొడవలూరు:** మండలంలో కొడవలూరు, గండవరం, నార్తు రాజుపాళెం, యల్లయపాళెం, గుండాలమ్మపాలెం, కొత్తవంగల్లుతో సహా 79 పాఠశాలలకు గాను 78 పాఠశాలల్లో గురువారం విద్యాకమిటీ ఎన్నికలు జరగ్గా వెంకన్నపురం పాఠశాలలో వాయిదా పడింది. కాగా, గండవరం గ్రామంలో జరిగిన ఈ ఎన్నికల్లో విద్యాకమిటీ చైర్మన్‌గా ఎన్నికైన తొట శిరిషను, వైస్ చైర్మన్ పి నాగమణిని టీడీపీ సీనియర్ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

●**బుచ్చిరెడ్డిపాళెం:** మండలంలో మొత్తం 69 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో గురువారం స్కూలు యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు నిర్వహించారు. 62 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లను, సభ్యులను ఎన్నుకోగా 7 పాఠశాలల్లో కమిటీలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 69 పాఠశాలల్లో కమిటీలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యుల ఎంపికలు జరిగాయని ఎంఈఓ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలకు జిల్లా పరిశీలకులుగా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, మండల పరిశీలకులుగా ఎంఈఓ దిలీప్‌కుమార్, ఎంఈఓ 2 పీవీ రత్నం వ్యవహరించారు. ఎన్నికల్లో ఏటూరి శివరామకృష్ణారెడ్డి, ఎంపీపీ శ్రీనివాసులు, పలువురు సర్పంచులు భాగ్యలక్ష్మి, పెంచలయ్య, మహేంద్ర, గోపీ, రాము, చెంచయ్య, కృష్ణయ్య, మహేష్, ప్రవీణ్, ఆయా గ్రామాల పెద్దలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. కాగా, పెనుబల్లి, దామరమడుగు ఎన్నికల్లో సీపీఎం, టీడీపీ నాయకుల మధ్య వివాదం జరిగింది. పలువురు మందలించడంతో సద్దుమణిగింది.

●**కోవూరు:** మండల పరిధిలోని పలు మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యాకమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు గురువారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్టౌటీడీ ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా చింతంగారి నరసమ్మ, ఉపాధ్యక్షురాలిగా వీపీ వెంకట సుజన, ఉర్దూ పాఠశాల కమిటీ చైర్మన్‌గా షేక్ చాందినీ ఎంపికయ్యారు. అలాగే పలు పాఠశాలలకు విద్యాకమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఎంపికయ్యారు. కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

●**ఇందుకూరుపేట:** మండలంలోని కొత్తూరు గునపాటి సుబ్బరామిరెడ్డి రుక్మిణమ్మ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు చైర్మన్‌గా నెల్లూరు మల్లికార్జున్, వైస్ చైర్మన్‌గా పిట్టు మమత ఎన్నికయ్యారు. అదేవిధంగా నరసాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి సనుమూరు సురేఖను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు, బీజేపీ మండల ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●**మనుబోలు:** మండలంలోని 39 ప్రాథమిక, 8ప్రాథమికోన్నత, 5ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు సజావుగా జరిగాయి. ఎన్నికైన సభ్యులను టీడీపీ నాయకులు సాని వెంకటరమణయ్య, దండుచంద్రశేఖర్‌రెడ్డి, కలికి వేణుగోపాల్‌రెడ్డి, పొన్నూరు అశోక్, అల్లూరు సుమన్‌తేజాలు అభినందించారు.

● **వెంకటాచలం** : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. కొన్ని చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, మరికొన్ని చోట్ల ఎన్నికలను నిర్వహించారు. టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు గుమ్మడి రాజాయాదవ్, కుంచి శ్రీనివాసులు యాదవ్, ప్రధాన కార్యదర్శి వల్లూరు రమేష్‌నాయుడ తదితరులు పర్యవేక్షించి మద్దతుదారులను గెలిపించుకున్నారు.

●**తోటపల్లిగూడూరు** : మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, చెన్నపల్లిపాలెం, ఐవీఆర్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పాపిరెడ్డిపాలెం మండల పరిషత్ పాఠశాల, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా గురువారం జరిగాయి. గెలుపొందిన చైర్మన్‌కు ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ నియామక పత్రం అందించి అభినందనలు తెలిపారు. ఈ స్కూల్ కమిటీ ఎన్నికల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, టీడీపీ నేతలు బైనిబోయిన శ్రీనివాసులు, ఊటుకూరు శ్రీనివాసులు, మేనాటి సీనయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, ఆగస్టు 8: గ్రామంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని వెంకన్నపాళెం టీడీపీ నాయకులు గురువారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యను కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడపాల శివ కుమార్ రెడ్డి, శేఖర్‌నాయుడు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

●**కొడవలూరు:** మండలంలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మాజీ మహిళా అధ్యక్షురాలు చిట్టిబోయిన కామక్షి తహసీల్దారు స్ఫూర్తిని కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు తదితరులున్నారు.

ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూముల కబ్జా

● టీడీపీ నేత విజయరాజు ఆరోపణ


మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు కూరపాటి విజయరాజు, తదితరులు

మనుబోలు, ఆగస్టు 8: మండలంలోని కొమ్మలపూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెందులూరు శ్రీనువాసులు ఫోర్జరీ పత్రాలతో చెరుకుమూడి రెవెన్యూలో 40 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమించారని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు కూరపాటి విజయరాజు ఆరోపించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కొమ్మలపూడి గ్రామస్థులతో కలిసి ఆయన మాట్లాడుతూ చెరుకుమూడి నుంచి కొమ్మలపూడి వరకు 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను ఆక్రమించి, ఫోర్జరీ సంతకాలు, స్టాంపులతో ఆయన పత్రాలు సృష్టించారన్నారు. దీనిపై సీఐడికి ఫిర్యాదు చేయనున్నామన్నారు. అక్కంపేటలో మరో భూకబ్జా చేశారన్నారు. దళితులకిచ్చిన ప్రభుత్వభూమిని కిరణ్ కుమార్‌రెడ్డి రాయించుకుని తిరిగి అదే భూమిని జగనన్న లేఅవుట్ కోసం ప్రభుత్వానికే అమ్మాడన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెంచలయ్య పాల్గొన్నారు.

నీటి కుళాయికి మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న టీడీపీ నాయకులు

కోవూరు, ఆగస్టు 8: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు టీడీపీ నాయకుడు నాటకరాని వెంకట్ ఆధ్వర్యంలో స్థానిక దొమ్మరపాళెంలోని తాగునీటి కొళాయికి గురువారం మరమ్మతులు చేపట్టి నీటిసమస్య పరిష్కరించారు. అలాగే స్థానిక గుమ్మళ్ళదిబ్బ కాలనీలోని శ్మశానాన్ని టీడీపీ నాయకులు సొంత నిధులతో చదునుచేసి ముళ్ళపొదల్ని తొలగించారు. దీంతో స్థానికులు టీడీపీ నాయకుల్ని అభినందించారు.

పుణ్యక్షేత్రాలను అపవిత్రం చేసింది వైసీపీ నేతలే

● టీడీపీ నేత గుమ్మడి రాజాయాదవ్


మాట్లాడుతున్న రాజాయాదవ్

వెంకటాచలం, ఆగస్టు 8: వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కసుమూరు, గొలగమూడిలను అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించి అపవిత్రం చేసింది వైసీపీ నాయకులేనని, అవినీతి, అక్రమాలకు పాల్పడే కాకాణికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డిని విమర్శించే స్థాయి లేదని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ విమర్శించారు. వెంకటాచలంలోని ఆపార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గడిచిన ఐదేళ్లల్లో వైసీపీ నాయకులు కసుమూరు, కృష్ణపట్నం పోర్టు రోడ్డుల్లో వ్యభిచారం, అడవి ప్రాంతంలో పేకాట, గ్రామ శివారుల్లో కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు అడ్డుఅదుపు లేకుండా నిర్వహించారన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకుల నుండి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసీపీ నాయకులు డబ్బులు వసూళ్లు చేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులకు ధైర్యం ఉంటే ఈనెల 11వ తేదీన గొలగమూడిలోని వెంకయ్యస్వామి సన్నిధిలో ప్రమాణం చేసేందుకు రావాలని, ఒకవేళ మామూళ్లు దండుకొని ఉంటే రావాల్సిన అవసరం లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు8: మండలంలోని దామరమడుగులో మసీదు రోడ్డులో గురువారం వేకువజామున సమీర్ భాష(18) అనే యువకుడు బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. 108 సిబ్బంది క్షతగాత్రుడిని బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలందించి బంధువులకు సమాచారమిచ్చి అక్కడినుంచి నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతిలో స్విమ్స్‌కు తీసుకెళ్తుండగా అనుమానంతో మార్గమధ్యంలో శ్రీకాళహస్తిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని దామరమడుగులో ఇంటికి తీసుకొచ్చారు. కాగా, రోడ్డు ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదు. మృతిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

కోవూరు, ఆగస్టు 8: స్థానిక గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులు, అధ్యాపకులు మొక్కల్ని నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే సందీప్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత అన్నారు. వాతావరణ కాలుష్య నివారణకు చెట్లు ఎంతో మేలు చేస్తాయన్నారు. కరస్పాండెంటు సుధాకరరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, ప్రకృతి వనరుల్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసరు వై మురళీకృష్ణ పాల్గొన్నారు.

భోనాల సంబరం


కోదండరామస్వామి ఆలయం నుంచి బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు


తప్పెట్లు, నిప్పు కళాకారుల విన్యాసం

నగరంలోని కోదండరామపురంలో గల మహాలక్ష్మి ఆలయంలో 16వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం గోపూజ, గణపతిపూజ, కలిశ స్థాపన జరిగాయి. సాయంత్రం అమ్మవారికి బోనాల ఉత్సవం జరిగింది. ఉస్మాన్ సాహెబ్ పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు తలపై పెట్టుకుని మేళతాళాలతో ఊరేగింపుగా కోదండరామపురంలోని మహాలక్ష్మి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఉభయ కర్తలుగా కాటేపల్లి వెంకట రమణయ్య, సరిత వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆగమ పండితుడు మాచవోలు రమేష్‌శర్మ, మహాలక్ష్మి ఆలయ ప్రధాన అర్చకుడు మాచవోలు వేణుగోపాల శర్మ, ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. వార్షికోత్సవాల్లో శుక్రవారం ఉదయం 10గంటలకు సామూహిక కుంకుమాపూజ, రాత్రికి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరగనున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)

పద్మావతి అమ్మవారికి పంగున్యోత్తర అభిషేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 : పద్మావతి అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తర పల్గుణి సందర్భంగా నగరంలోని మాగుంట లే అవుట్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. శుక్రవారం గరుడ పంచమి, నాగ పంచమి పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఉదయం 9గంటలకు అనంత నాగరాజ సహిత గరుడాళ్వార్‌కు తిరుమంజనం, రాత్రి 7గంటలకు ఆలయ మాడవీధుల్లో శ్రీవారికి గరుడ సేవ జరుగుతాయన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

జీజీహెచ్‌లో రూ.80 లక్షలతో డయాలసిస్ యూనిట్

● బయ్యా సరోజనమ్మ పేరుతో కేటాయింపు ● ఏటా నిర్వహణకు రూ. 10లక్షలు

● నేడు ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్


డయాలసిస్‌కు సంబంధించిన ఆధునిక పరికరం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 8 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్‌ను బయ్యా సరోనమ్మ పేరుతో ఆమె కుమారులు బయ్యా రవికుమార్, బయ్యా శ్రీనివాసులు ఏర్పాటు చేశారు. రూ. 80 లక్షల వ్యయంతో 6 డయాలసిస్ పడకలతో ఏర్పాటు చేసిన ఈ విభాగాన్ని శుక్రవారం రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభించనున్నారు. శుభమస్తు ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ విభాగం ప్రారంభం కానుంది. ఈ డయాలసిస్ విభాగం నిర్వహణకు ఏటా రూ.10 లక్షలు అవసరంకాగా ఆ మొత్తాన్ని అందించేందుకు దాతలు రవికుమార్, శ్రీనివాసులు సమ్మతించారు. ఇక్కడ అవసరమైన సెంట్రల్ ఏసీ కోసం రూ. 3.91 లక్షలు వెచ్చించారు. అలాగే రూ. 4.39 లక్షల విలువైన 30 కిలో వాట్ల బ్యాటరీలను, ఇన్‌వర్టర్‌ను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాటర్ క్యూరింగ్ కోసం పెద్ద వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. డయాలసిస్ సమయంలో గుండె సమస్యలు ఎదురైతే వెంటనే తగిన చికిత్సలు అందించేందుకు ప్రత్యేక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన డయాలసిస్ టెక్నీషియన్లు ఇక్కడ పనిచేస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దా నాయక్ తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టండి : కోటంరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 : నగరంలోని నెక్లెస్‌రోడ్డుపై ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టాలని నుడా మాజీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధికారులను కోరారు. గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనలతో ఆయన అధికారులతో కలిసి నెక్లెస్ రోడ్డును పరిశీలించారు. ఆ రోడ్డు మరమ్మతులతోపాటు స్వర్ణాల చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కకు తొలగింపు వంటి చర్యలపై చర్చించారు. ఎన్టీఆర్ విగ్రహంతో పాటు ఇతర మహనీయుల విగ్రహాలకు మరమ్మతులు చేసి ఆ ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పడవల కృష్ణమూర్తి, గండవరపు నాని, మురళి పాల్గొన్నారు.

వాణిశ్రీ హైస్కూల్ చైర్మన్‌గా తుళ్లూరు పెంచలయ్య

నెల్లూరు రూరల్, ఆగస్టు 8 : రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలోని వాణిశ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా స్థానిక గ్రామానికి చెందిన తుళ్లూరు పెంచలయ్య, వైస్ చైర్మన్‌గా బట్టా శ్రావణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం విద్యా కమిటీ ఎన్నికలు జరగ్గా, అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో పెంచలయ్య పేరును ప్రతిపాదించాయి. ఉపాధ్యాయులు అతనినే చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. మరో 24 మందితో కమిటీని నియమించారు. హైస్కూల్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పెంచలయ్య తెలిపారు. ఆయనకు పలువురు నాయకులు శుభాకంక్షలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వసతులు కల్పించండి : డీపీవో

నెల్లూరు రూరల్, ఆగస్టు 8 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత ఆదేశించారు. రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజుల సర్పంచుల శిక్షణ తరగతులను ఆమె డీఎల్‌డీవో డీ వసుమతితో కలిసి గురువారం ప్రారంభించారు. పల్లెల్లో సురక్షిత తాగునీరు, నాణ్యమైన విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలను కల్పించాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టితో పంచాయతీలకు ఆర్థిక వెలుసులుబాటు కలుగుతుందన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను గ్రామాలలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో శైలేంద్రకుమార్, ఈవోపీఆర్డీ పెంచలశ్యాం పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెడదాం : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, ఆగస్టు 8 : ఎన్నికలు పూర్తయినందున రాజకీయ విభేదాలు పక్కనపెట్టి పార్టీ శ్రేణులంతా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 33వ డివిజన్ వెంగళరావునగర్‌లో రూ.20 లక్షలతో సీసీరోడ్ల పనులను గురువారం ఆయన ప్రారంభించారు. రాబోయే రెండు నెలల్లో డివిజన్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు రూ. కోటి నిధులు కేటాయించి అభివృద్ధి పనులు మొదలుపెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరణం మంజుల, నాయకులు హజరత్‌నాయుడు, మన్నెం పెంచలయ్య నాయుడు, జలదంకి సుధాకర్, మండ్ల ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేయాలి

● ఆవాజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రషీద్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 8 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ఎంపీలందరూ ఓటు వేయాలని వివిధ సంఘాల నేతలు కోరారు. గురువారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డును మరింత బలహీనం చేసేందుకు ఈ చట్ట సవరణలు చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జియావుల్ హక్ మాట్లాడుతూ ఇప్పటికే వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని, కొత్త చట్టం వల్ల బోర్డు మరింత బలహీనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, న్యాయవాది హమీదా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు ఎల్ఎంఎస్ : ప్రిన్సిపాల్ గిరి

నెల్లూరు (విద్య), ఆగస్టు 8 : అధ్యాపకుల్లో నైపుణ్యాలను పెంపొందించి కళాశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఎల్ఎంఎస్) ఎంతో ఉపయోగపడుతుందని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు. నగరంలోని ఆ కళాశాలలో మంగళవారం కంటెంట్ డెవలప్‌మెంట్ స్టూడియోలో అధ్యాపకులకు నిర్వహించే ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులకు వీడియో మేకింగ్, ఎడిటింగ్, ఆడియో, వీడియో పాడ్ కాస్ట్, పీపీటీ క్రియేషన్ వంటి అంశాల్లో శిక్షణ అందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని 155 మంది అధ్యాపకులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారన్నారు. వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, మాస్టర్ ట్రైనర్స్ డాక్టర్ ఐఎస్ చక్రపాణి, డాక్టర్ టీ శ్రీరంజని, టీ మౌనిక, జీ యుగంధర్, జేకేసీ మెంటర్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త చట్టాలను రద్దు చేయాలి : ఐలు

నెల్లూరు (లీగల్), ఆగస్టు 8 : కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్తగా అమలులోకి తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని అల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు న్యాయవాదులు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం నిరసన తెలియజేశారు. భారతీయ నాగరిక సురక్ష-2023, భారతీయ సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియం-2023 మూడు చట్టాల వల్ల పౌర సమాజం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎస్ అంకయ్య, చుక్కా రమేష్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సాయినాథుడి నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 8 : నగరంలోని మైపాడు గేటు వద్ద నూతనంగా నిర్మించిన సాయిబాబా మందిరం విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా గురువారం నగరోత్సవం జరిగింది. విశేష పుష్పాలంకారం, మంగళవాయిద్యాలతో నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. మందిరం కమిటీ సభ్యుడు లెక్కల వెంకటరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం జరుగుతాయని తెలిపారు.

ముగిసిన ఆండాళ్ ఉత్సవాలు

తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆండాళ్ తాయారు తిరువాడిప్పూడి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం గంధం పొడి ఉత్సవం, అనంతరం తిరుమంజనం సేవలు జరిగాయి. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కృష్ణాష్టమి కరపత్రాల విడుదల

చిరంజీవి సేవా సమితి ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లో ఈ నెల 26 నుంచి 30వతేదీ వరకు జరిగే కృష్ణాష్టమి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ గురువారం జరిగింది. నిర్వాహకుడు కొట్టే వెంకటేశ్వర్లు, దాతలు, భక్తులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 8 : మాదిగల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం గుంటూరులోని ఎస్సీ కార్పొరేషన్ ఎండీ చిన్నరాముడును సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగలకు సంబంధించిన అనేక సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లామని, ఎస్సీ కార్పొరేషన్‌కు విరివిరిగా నిధులు కేటాయించాలని కోరామన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 8 : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న కొందర ఉద్యోగులు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై విచారణ జరపాలని కోరుతూ హౌసింగ్ పీడీ దయాకర్‌కు గురువారం ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయకృష్ణ మాదిగ వినతిపత్రం ఇచ్చారు. కొందరు అవినీతికి పాల్పడి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, ఏఈజీ నాయకుడు ఏపూరి వెంకటేశులు మాదిగ, ఎంఈఎఫ్ నాయకుడు బెజవాడ పాపయ్య పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 8 : టీవీ నటుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు పుట్టిన రోజు సందర్భంగా గురువారం రామలింగాపురం అన్నా క్యాంటీన్ భవనం వద్ద అన్నదానం చేశారు. మురళీమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన అన్నా క్యాంటీన్లు ప్రారంభ మవుతాయన్నారు. ఈ క్రమంలో ఆ క్యాంటీన్ల వద్దే పేదలకు అన్నదానం చేస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ, సామాజికవేత్త తేళ్లపల్లి రాఘవయ్య, బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణ. తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంగీత పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి

నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 8 : ఎందరో కళాకారులను తీర్చిదిద్దిన నెల్లూరులోని ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల జిల్లాకే తలమానికమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. గురువారం ఆ నృత్య పాఠశాలను జనసేన నాయకులు సందర్శించారు. మహాకవి తిక్కన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలకు సొంత భవనం లేకపోవడం విచారకరమన్నారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్ఈఈవో ధర్మేంద్రకు సన్మానం

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 8 : వైద్య ఆరోగ్యశాఖలో హెచ్ఈఈవోగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న కాట్రగడ్డ ధర్మేంద్రను ఏపీ హంస అసోసియేషన్ నేతలు గురువారం సన్మానించారు. నగరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ అనాథాశ్రమాల్లో అన్నదానంతోపాటు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందించడం వంటి అనేక కార్యక్రమాలు ధర్మేంద్ర చేపట్టారన్నారు. ప్రస్తుతం వైజాగ్‌లో పనిచేస్తూ కూడా నెల్లూరులో సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హంస జిల్లా కోశాధికారి మజురుల్లా, గౌస్‌బాషా పాల్గొన్నారు.

ఎస్పీతో జడ్పీ చైర్‌పర్సన్ దంపతుల భేటీ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 8: ఎస్పీ జీ కృష్ణకాంత్‌ను గురువారం పోలీసు కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయ కుమార్‌రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారు పలు అంశాలపై ఎస్పీతో చర్చించారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఆగస్టు 2024



విద్యా కమిటీల ఎన్నికలు ప్రశాంతం

1958 చోట్ల ఏకగ్రీవం.... 347 చోట్ల పోటీ

తిరుపతి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం విద్యాశాఖ నిర్వహించిన పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి.ప్రాథమిక పాఠశాలలు 1846 వుండగా అందులో 1583 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 226 స్కూళ్ళలో పోటీ జరిగింది. మొత్తం మీద 1809 చోట్ల ఎన్నికలు ముగిశాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు 186 వుంటే 145 చోట్ల ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. 37 చోట్ల పోటీ నెలకొనగా మొత్తం మీద 182 స్కూళ్ళలో ఎన్నికలు పూర్తయ్యాయి. ఉన్నత పాఠశాలలు 322 వుండగా 230 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 84 చోట్ల పోటీ జరగగా మొత్తంగా 314 హైస్కూళ్లలో ఎన్నికల ప్రక్రియ ముగిసింది.

17 చోట్ల ఎన్నికలు వాయిదా

బాలాయపల్లి మండలంలో ఒక ప్రైమరీ, చిల్లకూరు మండలంలో ఒక యుపీ, చిట్టమూరు మండలంలో ఒక హైస్కూలు చొప్పున మూడు చోట్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కేవీబీపురం మండలంలో నాలుగు ప్రైమరీ, ఒక హైస్కూలు వంతున ఐదు చోట్ల ఎన్నికలు వాయిదా వేశారు. కోట మండలంలో ఒక ప్రైమరీ,ఒక యూపీ,ఒక హైస్కూలు చొప్పున మూడు చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. ఆర్సీపురం మండలంలో ఒకటి, తడ మండలంలో ఒకటి, వరదయ్యపాలెం మండలంలో ఒకటి చొప్పున మూడు చోట్ల ఎన్నికలు ఆగిపోయాయి. వెంకటగిరి మండలంలో ఒక హైస్కూలు, ఏర్పేడు మండలంలో ఒక ప్రైమరీ, ఒక హైస్కూళ్ళలో ఎన్నికలు వాయిదా పడ్డాయి.



కోట మండలం గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో చేతులెత్తుతున్న టీడీపీ, వైసీపీ మద్దతు దారులు

ఎన్నికల సందర్భంగా స్వల్ప ఘటనలు

- కోట మండలంలోని గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో చేతులు ఎత్తేందుకు టీడీపీ, వైసీపీ మద్దతుదారులు 217 మంది హాజరయ్యారు.అయితే ఓటర్లను ప్రలోభపెడుతున్నారంటూ రెండు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. పరిస్థితి గమనించిన విద్యాశాఖ అధికారులు ఎన్నికలను వాయిదా వేశారు.ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా చైర్మన్ పదవి తమ వర్గానికే కావాలంటూ టీడీపీ, వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగడంతో ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు.
- చిట్టమూరు మండలం యాకసిరి జడ్పీ హైస్కూల్లో లో వైసీపీకి మద్దతు ఇస్తున్నారంటూ ప్రధానోపాధ్యాయుడిపై టీడీపీ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు వాయిదా వేయాలని పట్టుబట్టడంతో ఎన్నికలు ఆగిపోయాయి.
- వరదయ్యపాలెం మండలం కళత్తూరు పాఠశాలలో ఎన్నిక వాయిదా పడింది. గ్రామస్తుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో గ్రామస్తుల అభ్యర్థనతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
- కేవీబీపురం మండలం మోడల్ స్కూల్లో ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరగడంతో ఉద్రిక్తత నెలకొంది.
- చంద్రగిరి మండలం తొండవాడ హైస్కూల్లో ఎన్నికలు జరుగుతుండగా వైసీపీ నేత మల్లం చంద్రమౌళిరెడ్డి అనుచరులతో వచ్చి ప్రోటోకాల్ పాటించడం లేదని అడ్డుకున్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఎంసీ ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు.
- కేవీబీపురం మండలం కోవనూరు, వేమలపూడి, కండ్లూరు, అంజూరుపాలెం పాఠశాలల్లో టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ సయోధ్య కుదరకపోవడంతో తల్లిదండ్రులు వెళ్ళిపోవడంతో ఎన్నికలు జరగలేదు.

పెళ్లయిన గంటల్లోనే విషాదం

- వధువును హతమార్చి.. వరుడి ఆత్మహత్య
- వాట్సాప్ చాటింగా, మరేదైనా కారణమా?



వివాహ సమయంలో నిఖిత, నవీన్

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 8: అబ్బాయిది చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం సంతూరు. అమ్మాయిది కర్ణాటక రాష్ట్రం బైనహళ్లి. పెళ్లయింది బుధవారం ఉదయం చంబరసనహళ్లి గ్రామంలో. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే గదిలో నవదంపతుల మధ్య ఏం జరిగిందో కానీ.. కొడవలి దాడితో వధువు మృతి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వరుడు..గురువారం ఉదయం అసువులు బాశాడు. వీరి మృతిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వధువు వాట్సాప్ చాటింగ్ కారణమని కొందరు.. అతడి మానసిక స్థితి సరిగాలేదని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. శాంతిపురం మండలం సంతూరు గ్రామానికి చెందిన జయమ్మ, మునెప్ప దంపతుల కుమారుడు నవీన్ (30) సోదరికి కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ తాలూకా చంబరసనహళ్లికి చెందిన వ్యక్తితో వివాహమైంది. రామకుప్పం, శాంతిపురం మండలాల మధ్య.. కర్ణాటక సరిహద్దు గ్రామమైన రాజుపేట క్రాస్‌లో నవీన్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం బైనహళ్లికి చెందిన శ్రీనివాసులు, లక్ష్మి దంపతుల కుమార్తె నిఖితశ్రీతో నవీన్‌కు బుధవారం ఉదయం చంబరసనహళ్లి (వరుడి సోదరి గ్రామం)లో వివాహమైంది. నవదంపతులిద్దరూ బంధువులతో కొద్దిసేపు ఆహ్లాదంగా గడిపారు. ఆ తర్వాత నిఖితశ్రీతో పాటు ఆమె తల్లిదండ్రులను గ్రామంలోని తన అక్క ఇంటికి నవీన్ తీసుకెళ్లాడు. కొంతసేపటి తర్వాత నవదంపతులు ఓ గదిలోకి వెళ్లారు. కొంతసేపటికే వారి గదిలో నుంచి కేకలు వినిపించాయి. నవీన్ మేనకోడలు కిటికీలో నుంచి చూడగా నిఖితపై అతడు కొడవలితో దాడి చేయడం కనిపించింది. వెంటనే నిఖిత తల్లిదండ్రులు, ఇతర బంధువుల గది తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే నిఖిత రక్తపుమడుగులో.. పక్కనే నవీన్ తీవ్రగాయాలతో పడున్నారు. వీరిద్దరినీ కోలారులోని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే నిఖిత మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. నవీన్ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అండర్‌సన్ పోలీసులు తెలిపారు. కాగా, ఇష్టపూర్వకంగా పెళ్ళి చేసుకున్న నవీన్.. భార్యను చంపి, తాను ఆత్మహత్యకు పాల్పడటంపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.


ఘటన వెనుక ఏం జరిగింది?

ఈ ఘటనపై స్థానికంగా భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొంతకాలంగా నవీన్ మానసిక పరిస్థితి సరిగాలేదని, దీనివల్లే ఈ ఘటన జరిగి ఉండచ్చొని కొందరు చెబుతున్నారు. వధువు సెల్‌ఫోను చాటింగే కారణమని అతడి సన్నిహితులు చెబుతున్నట్లు తెలిసింది. పెళ్లయిన కొద్దిసేపటికే నిఖిత సెల్‌ఫోనులో చాటింగ్ చేయడాన్ని అతడు గమనించాడని అంటున్నారు. అనుమానంతో ఆమె ఫోను తీసుకుని చూడగా ఓ యువకుడితో చాట్ చేసినట్లు గుర్తించాడని చెబుతున్నారు. దీంతో గదిలోకి వెళ్లగానే దీనిపై ప్రశ్నించడం..ఆ నేపథ్యంలోనే ఆమెపై దాడి చేసి హతమార్చి.. తానూ ఆత్మహత్యకు యత్నించి ఉంటాడని భావిస్తున్నారు.

గ్రామంలో విషాదం

జనసేనలో క్రియాశీల కార్యకర్తగా, సౌమ్యుడిగా పేరున్న నవీన్ జీవితం విషాదాంతం కావడం స్థానికులను బాధకు గురిచేసింది. సున్నిత మనస్కుడైన ఇతడు.. ఎవరికీ హాని కలిగించే మనస్తత్వం కాదని స్నేహితులు, జనసేన శ్రేణులు చెప్పారు. అలాంటి వ్యక్తి ఎందుకిలా చేశాడో అర్థం కావడంలేదన్నారు. కాగా నిఖిత అంత్యక్రియలు బైనహళ్లిలో, నవీన్ అంత్యక్రియలు చంబరసనహళ్లిలో జరిగాయి.

తిరుపతి డీఎస్పీగా వెంకటనారాయణ



వెంకటనారాయణ




చెంచుబాబు



విజయశేఖర్



వెంకటాద్రి



రవికుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: తిరుపతి డీఎస్పీగా వెంకటనారాయణ నియమితులయ్యారు.గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీఐగా, డీఎస్పీగా వెంకటనారాయణ పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం తిరుపతి ట్రాఫిక్‌లో పనిచేసాక ఇక్కడినుంచి గుంటూరు రూరల్‌కు బదిలీపై వెళ్లారు.శుక్రవారం వెంకటనారాయణ తిరుపతిలో బాధ్యతలు తీసుకోనున్నారు. అలాగే తిరుమల డీఎస్పీగా విజయశేఖర్ నియమితులయ్యారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందిన ఈయన చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతి ట్రాఫిక్, కర్నూలు డీఎస్పీగా పనిచేశారు. ఎన్నికల అనంతరం జరిగిన డీఎస్పీల బదిలీల్లో ఆయన్ను వెయిటింగ్ లిస్ట్‌లో పెట్టారు. ఈయనతో పాటు తిరుపతి రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా పనిచేస్తూ డెప్యుటేషన్‌పై తిరుపతి క్రైం డీఎస్పీగా ఏడాది పనిచేసిన రవికుమార్‌ను పుత్తూరు డీఎస్పీగా నియమించారు. తిరుపతి రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీగా పనిచేస్తున్న చెంచుబాబును నాయుడుపేట డీఎస్పీగా నియమించారు.తిరుపతిలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటాద్రిని రేణిగుంట డీఎస్పీగా నియమించారు.రేణిగుంట డీఎస్పీగా పనిచేస్తున్న భవ్యకిషోర్‌ను రాజమండ్రి సౌత్ జోన్ డీసీపీగా నియమించారు. సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్న సోమన్నను ఆదోని డీఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది. పుత్తూరులో డీఎస్పీగా పనిచేస్తున్న ఎంపర్ల శ్రీనివాసరావు సీఐడీ డీఎస్పీగా నియమితులయ్యారు.

శ్రీకాళహస్తిలో నకిలీ విలేకరి హల్‌చల్



నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 8: రోడ్డుపై ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న కారును పక్కన పెట్టమన్నందుకు ఓ నకిలీ విలేకరి కానిస్టేబుల్‌పై రెచ్చిపోయి చివరకు అడ్డంగా దొరికిపోయాడు. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు.... ఏర్పేడు మండలం కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే యువకుడు కారులో గురువారం శ్రీకాళహస్తికి వచ్చాడు. ఆర్టీసీ కూడలి సమీపంలో రోడ్డు పక్కన కారు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ స్తంభించింది. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ చెంచయ్య కారును పక్కకు తీయాలని నాగేశ్వరరావుకు చెప్పగా వాగ్వాదానికి దిగాడు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి విలేకరినంటూ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కారును స్టేషన్‌కు తరలించారు.నాగేశ్వరరావు వద్ద ఉన్న అక్రిడిటేషన్ కార్డును సీఐ నరసింహారావు పరిశీలించగా అది నకిలీదని తేలింది.పోలీసు విధులకు ఆటంకం కలిగించడం,నకిలీ గుర్తింపుకార్డుతో విలేకరిగా చలామణి కావడంపై కేసు నమోదు చేశారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 8: తిరుపతి రుయాస్పత్రిలో డాక్టర్ అని చెప్పి రోగుల సహాయకులను మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు....సత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం నరసంపల్లి తాండాకు చెందిన బనావత్ సాయికుమార్ తిరుపతిలో వుంటున్నాడు.నగదు, మొబైల్ ఫోన్లు కొట్టేయడంలో దిట్ట. మదనపల్లెకు చెందిన అశోక్ తన కుమార్తె దీపికను చికిత్స నిమిత్తం ఇటీవల రుయాస్పత్రికి తీసుకొచ్చాడు. బనావత్ సాయికుమార్ తెల్లకోటు వేసుకుని, స్టెతస్కోపుతో డాక్టర్ అని చెప్పి అశోక్‌ను నమ్మించాడు.అతని వద్ద వున్న మొబైల్ ఫోన్ తీసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతా నుంచి రూ 40,000 డ్రా చేశాడు. మోసపోయినట్లు గ్రహించాక అశోక్ తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం తిరుపతి-చెర్లోపల్లి రోడ్డులోని గరుడ సర్కిల్ వద్ద వుండగా సాయికుమార్‌ను అరెస్టు చేసారు. అతని వద్ద నుంచి మొబైల్ ఫోను, రూ 35,000 స్వాధీనం చేసుకున్నారు.



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు అందజేసే ముందు రాకెట్ నమూనా మెమెంటోను ప్రదర్శిస్తున్న మోహన్‌బాబు

2040లో చంద్రుడి మీదకు అతి తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాం

అంతరిక్ష వారోత్సవాల్లో ఇస్రో చైర్మన్ సోమనాథ్

చంద్రగిరి, ఆగస్టు 8: అతి తక్కువ ఖర్చుతో 2040లో మనుషులను చంద్రుడి మీదకు తీసుకెళ్ళేందుకు పరిశోధనలు చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతరిక్ష వారోత్సవాల్లో గురువారం నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన సోమనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్షరంగంలో దేశం ప్రతిష్ఠ పెరిగిందన్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వెళ్లడానికి విమానంలో 30 గంటల సమయం పడుతుందని, అయితే రాకెట్‌లో 30 నిమిషాల్లో చేరేందుకు అమెరికన్ ఇంజనీర్,టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ప్రయోగాలు జరుపుతున్నార న్నారు.ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ యువ శాస్త్రవేత్తలకు ఆదర్శనీయుడంటూ కొనియాడారు. ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ ఇస్రో, ఎస్ఏఆర్ఎల్ సహకారంతో ముందుకెళతామన్నారు.షార్ డైరెక్టర్ రాజరాజన్, ఎస్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్ కుమార్ పాత్ర, ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ నాగరాజరామారావ్, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు డీఎంహెచ్‌వో సంతకం ఫోర్జరీ

నెల్లూరు క్రైం,ఆగస్టు 8 : నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిపై సంతపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.... తిరుపతి జిల్లాకు చెందిన కరీముల్లాకు నెల్లూరులోని వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులతో పరిచయాలున్నాయి. దీంతో పలువురు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని, కాంట్రాక్టు ప్రాతిపదికన సాఫ్టనర్సు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు.నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురి వద్ద రూ.14 లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా డీఎంహెచ్‌వో పేరుతో ఉన్న అపాయింట్‌మెంట్ లెటర్ వారికి అందించాడు.వారిలో ఒకరైన వెంకటకృష్ణ ఆ అపాయింట్‌మెంట్ లెటర్ తీసుకుని డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిశాడు. తనకు మర్రిపాడు పీహెచ్‌సీలో పోస్టింగ్ ఇవ్వాలని కోరాడు.కంగుతిన్న డీఎంహెచ్‌వో అందులో ఉన్న సంతకం తనదికాదని, ఎవరో ఫోర్జరీ చేశారని గుర్తించారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం రాత్రి ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 ఆస్పత్రులపై 181 ఫిర్యాదులొచ్చాయ్

పునరావృతమైతే చర్యలు తప్పవన్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), ఆగస్టు 8: ఎన్టీఆర్ వైద్య సేవలకు సంబంధించి జిల్లాలోని పలు ఆస్పత్రులపై అనేక ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ 12వ డిస్ట్రిక్ట్ డిసిప్లినరీ కమిటీ మీటింగ్ కలెక్టరేట్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 104 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా 28 ఆస్పత్రులపై 181 ఫిర్యాదులందాయని, ఇవి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.అర్హులైన వారందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించాలని ఆదేశించారు.ఆస్పత్రుల యాజమాన్యంతో పాటు ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది, ఎన్టీఆర్ వైద్యమిత్ర, టీంలీడర్, జిల్లా మేనేజర్, కోఆర్డినేటర్లు బాధ్యత వహించాలన్నారు.ఆస్పత్రులకు వెళ్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. మూడు నెలల తరువాత మళ్లీ డిసిప్లినరీ కమిటీ మీటింగ్ నిర్వహిస్తామని ఈలోపు మళ్లీ ఫిర్యాదులు వస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.అన్ని ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా సంతృప్తికరమైన సేవలందించాలని సూచించారు.డీఎంహెచ్‌వో శ్రీహరి, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా మేనేజర్ శివకుమార్, టీంలీడర్లు, స్విమ్స్, రుయా, మెటర్నిటీ, రష్, అమర, నారాయణాద్రి, రమాదేవి, డీబీఆర్, సీఆర్ రెడ్డి, సంకల్ప ఆస్పత్రుల యజమానులు పాల్గొన్నారు.

ముగిసిన మారియమ్మన్ తిరుణాళ్ల



మారియమ్మన్‌కు గ్రామోత్సవం

తడ, ఆగస్టు 8: మండలంలోని కారూరు గ్రామదేవత మారియమ్మన్ తిరునాళ్ల గురువారం సాయంత్రం ముగిశాయి. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన తిరునాళ్లలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్థులు నైవేద్యం, సారె సమర్పించారు. గ్రామోత్సవం గురువారం సాయంత్రం వరకు నిర్విరామంగా జరిగింది. తిరునాళ్లను పురస్కరించుకుని గ్రామం బంధుమిత్రులతో కళకళలాడింది. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ గ్రామానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి వీడాలి



ధర్నా చేస్తున్న ఎంఎన్‌యూఏ నాయకులు

గూడూరు, ఆగస్టు 8: ఆర్టీసీలో కార్మికుల పట్ల ఆయా డిపోల మేనేజర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని మానుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య అన్నారు. గురువారం స్థానిక డిపో వద్ద జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ... డిపోల్లో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. గూడూరు నుంచి తిరుమల, చెన్నైలకు నూతన సర్వీసులను నడపాలన్నారు. మహిళా కండక్టర్లకు అవసరమైనపుడు సెలవులు ఇవ్వాలన్నారు. ధర్నాలో శేఖర్, వెంకయ్య, శ్రావణ్, బాషా, ప్రవీణ్, రమేష్, సుధాకర్, లక్ష్మి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



గూడూరు, ఆగస్టు 8: రేషన్ డీలర్ల వ్యవస్థను పున రుద్ధరిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమని గూడూరు రేషన్ డీలర్ల అసోసియేషన్ నాయకులు అన్నారు. గురువారం రెండో పట్టణ పరిధిలోని మాళవ్యా నగర్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి రవి మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చే ఇబ్బంది పడ్డామన్నారు. ఎండీయూ ఆపరేటర్‌ల పేరిట వాహనాలతో రేషన్ పంపిణీ చేయకపోగా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందన్నారు. రాంబాబు, జనార్దన్, షానవాజ్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

వయనాడు బాధితుల కోసం విరాళాల సేకరణ

గూడూరు, ఆగస్టు 8: కేరళ రాష్ట్రంలోని వయనాడులో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన బాధితులకు సాయం అందించేందుకు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో విరాళాలను సేకరించారు. రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు ఎ.గోపాల్‌రెడ్డి రూ. 10వేలు అందించారు. ప్రస్తుతానికి రూ. 13,650 సేకరించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శివకుమార్, వెంకటరామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అడ్డుగా ఉన్న విద్యుత్ లైను మార్చాలి: జనసేన

గూడూరు అర్బన్, ఆగస్టు 8: స్థానిక చవటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో అడ్డుగా ఉన్న విద్యుత్ లైను మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. చవటపాలెంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నూతనంగా తరగతి గదుల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. నిర్మాణం జరిగే ప్రాంతంలో 11కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండడంతో పనులకు అడ్డుగా ఉందన్నారు. అధికారులు స్పందించి లైన్‌ను పక్కకు మార్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో, రెవెన్యూ అధికారులకు విన్నవించామన్నారు. కార్యక్రమంలో ఇంద్రవర్దన్, చంద్రనీల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి తహసీల్దార్‌ను కలిసిన ఎంపీపీ



డక్కిలి, ఆగస్టు 8: డక్కిలి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుని గురువారం ఎంపీపీ జి.రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా కప్పి సన్మానించారు. మండల పరిషత్ పాలనలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థిని అదృశ్యం

కోట, ఆగస్టు 8 : పట్టణంలో విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. కళాశాలకు వెళ్లిన విద్యార్థిని ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల విచారించినా ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జనసేన మండల అధ్యక్షుడిపై వైసీపీ దాడి



దాడిలో గాయపడ్డ శివకోటి

వాకాడు, ఆగస్టు 8 : జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రౌతు శివకోటిపై గురువారం రాత్రి దాడి జరిగింది. ఘటనపై బాధితుడు శివకోటి మాట్లాడుతూ... వాల మేడు గ్రామంలోని వెలుగు వీవోఏ అక్రమాలపై గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ క్రమంలో వాలమేడు పరిసరాలలో క్రికెట్ టోర్నీని వీక్షించేందుకు వెళ్లడంతో వైసీపీ మూకలు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందానన్నారు. జరిగిన ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం

వాకాడు, ఆగస్టు 8: అనుమానాస్పద స్థితిలో మృతదేహం వెలుగు చూసింది. వాకాడు ఎస్ఎఎల్‌సీఎఫ్ గ్రౌండ్ సమీపంలోని పొలాల్లో నీటిలో తేలుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుతు గొల్లపాళెం గ్రామానికి చెందిన వి.కోటయ్యగా గుర్తించారు. 20 యేళ్ల క్రితం భార్య నుంచి దూరమై వాకాడు సమీపంలోని టెంకా యలతోపు వద్ద ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. కొంతకాలంగా కోటయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన కోటయ్య తిరిగి రాకపోవడంతో సరసమ్మ గాలిస్తూనే ఉంది. ఈక్రమంలో కోటయ్య పొలాల్లో విగతజీవిగా తేలాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 8: అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసి, 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విశ్వనాథ్ గురువారం సానిపాయ బేస్ క్యాంపు గుర్రపుదిబ్బ వైపు ఉన్న వీరబల్లి అటవీప్రాంతం నుంచి కూంబింగ్ చేపట్టారు. రాజంపేట వీరబల్లి ఫారెస్టు బీట్ పరిధిలో మాదిరెడ్డి గారిపల్లి సమీపానికి చేరుకోగా కొంతమంది వ్యక్తులు దుంగలను మోసుకెళుతూ కనిపించారు. వీరిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, టాస్క్‌ఫోర్సు పోలీసులను గమనించి దుంగలను పడేసి చెట్లపొదల్లోకి పారిపోయారు. ఒక వ్యక్తిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డస్మగ్లర్ తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరు తాలుకాకు చెందిన దొరస్వామి(47)గా గుర్తించారు. దీంతో ఆ ప్రాంతంలో పడి ఉన్న 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్టు షాపులు

మద్యం షాపుల సిబ్బందికి కాసుల పంట

వాకాడు, ఆగస్టు 8: మద్యం బెల్టు షాపులు వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్న విమర్శలున్నాయి. గత వైసీపీ హయాంలో నియమించిన మద్యంషాపుల సిబ్బంది బరితెగించి అదనంగా డబ్బు తీసుకొని బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు సైతం కాసులకు కక్కుర్తిపడి వాటిని ప్రోత్సహిస్తున్నారని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు, సెబ్ అధికారులు ఒకింత దృష్టిపెట్టి బెల్టు షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. దీంతో గాడిలో పడిందనుకుంటున్న తరణంలో మళ్లీ యథావిధిగా బెల్టుషాపులు తెరుచుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రారంభంలో మద్యంషాపుల సిబ్బంది అక్రమాలు చేయడానికి కొంచెం భయపడ్డారు. ఇంకా కొత్త మద్యంపాలసీ అమల్లోకి రాకపోవడంతో పాత ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారానే అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేసే సిబ్బంది, సూపర్‌వైజర్లు అత్యధికశాతం వైసీపీ సానుభూతిపరులే ఉన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కొత్తపాలసీ అమల్లోకి వస్తే ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండవని, ఎలాగూ తమను మళ్లీ ఉద్యోగాల్లోకి తీసుకోరని బరితెగించి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు షాపులకు మద్యం షాపుల సిబ్బంది ఒక్కో బాటిల్‌కు రూ.10 నుంచి రూ.20 అదనంగా సొమ్ము చేసు కుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇకబెల్టు షాపులను కట్టడి చేయాల్సిన సెబ్ సిబ్బంది నెలవారీ మామూళ్లకు అలవాటుపడ్డిన్నట్లు తెలుస్తోంది. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో సుమారు 90కు పైగా బెల్టుషాపులున్నాయి. దీంతో ఒక్కో బెల్టుషాపు నుంచి సెబ్ సిబ్బంది రూ.5వేలు మేర నెలవారీ మామూళ్ల వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సుమారు రూ.4.10 లక్షల రూపాయలు నెల వారీగా సెబ్ సిబ్బంది వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా విచ్చలవిడిగా బెల్టుషాపులను నిర్వహిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మద్యం బెల్టుషాపులను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ పునః ప్రతిష్ఠాపన

పెళ్లకూరు, ఆగస్టు 8: మండలంలోని చెంబేడులో నూతనంగా నిర్మించిన నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, పూర్ణాహుతి, మహాకుంభాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి వెంకటరాఘవరెడ్డి, మహేష్‌రెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం: కురుగొండ్ల



తిరుపతి - విజయవాడ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 8: త్వరలో రాష్ట్ర మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. గురువారం వెంకటగిరి ఆర్టీసీ డిపో నుంచి తిరుపతి, విజయవాడకు రెండు కొత్త బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో డిపోలో నడుస్తున్న సర్వీసులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బంది పెట్టారన్నారు. వైసీపీ సభలకు ఆర్టీసీ బస్సులను అడ్డగోలుగా వాడుకుందన్నారు. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్టీసీ నష్టపోయిందన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్టీసీని గాడిలో పెడుతున్నారన్నారు. ఇందులో భాగంగా కొత్త సర్వీసులు ప్రారంభమవుతున్నాయన్నారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకుంటారన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, వెంకటగిరి ఏఎంసీ మాజీ ఛైర్మన్ రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, పోలేరమ్మ దేవస్థాన మాజీ ఛైర్మన్ జి.మురళీకృష్ణ, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బి.రాజేశ్వరరావు, వెంకటగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గంగాధర్, రూరల్ టీడీపీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, ఏ.సత్యనారాయణ, ఆర్టీసీ డీఎం రామకృష్ణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎస్ఎంసీ ఎన్నికలు: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 8: సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే విజయశ్రీ చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... నియోజకవర్గంలో 392 పాఠశాలలకు గాను 387 పాఠశాలల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్ఎంసీ ఎన్నికల్లో భయభ్రాంతులకు గురిచేసి పోలీసులను పెట్టి జరిపించినట్లు విమర్శించారు. అంతేకాకుండా అమ్మఒడి అంటూ ఎంతోమంది తల్లిదండ్రులకు మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌లో చెప్పిన విధంగా సీఎం చంద్రబాబు అన్ని పథకాలను అమలు పరుస్తున్నారన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ఎన్నికలు జరిగాయన్నారు. రెండు పాఠశాలల్లో హెచ్ఎంలు నిబంధనలను పాటించలేదని వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రఫి, శ్రీనివాసులునాయుడు, రమేష్‌నాయుడు, మురళీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గంగాప్రసాద్, కన్నెమ్మ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

● **తడ**: మండలంలో మొత్తం 49 పాఠశాలలు ఉండగా, అందులో 45 పాఠశాలల్లో ఎస్ఎంసీలు ఏకగ్రీవమయ్యాయి. వాటంబేడుకుప్పం పాఠశాలలో కోరంలేక వాయిదా పడినట్లు ఎంఈవో మల్లికార్జున్‌రావు తెలిపారు.

● **చిట్టమూరు**: మండలంలో గురువారం జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో వైసీపీ నాయకుల ప్రయత్నాలను విద్యార్థుల తల్లిదండ్రులు తిప్పికొట్టారు. టీడీపీ బలపరిచిన వ్యక్తులకే వైసీపీ సానుభూతిపరుల చేతులెత్తారు. మండలంలో 82 పాఠశాలలకు గాను 81 స్కూళ్లల్లో టీడీపీ బలపరిచిన వ్యక్తులు ఛైర్లన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెట్టు ఉన్నత పాఠశాలలో వైసీపీ బలపరిచిన వ్యక్తి ఛైర్మన్ కాగా, వైస్‌ఛైర్మన్‌గా టీడీపీకి దక్కింది. యాకసిరి ఉన్నత పాఠశాల ఎన్నిక వాయిదా వేసినట్టు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు.

● **దక్కిలి**: మండలంలో 62 పాఠశాలల్లో టీడీపీ సానుభూతిపరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● **వెంకగటగిరి టౌన్**: వెంకటగిరి మండల పరిధిలోని 101 పాఠశాలలు ఉండగా వాటిలో 100 పాఠశాలలకు ఏకగ్రీవంగా ఎన్నికలు గురువారం ముగిశాయి. ఒక్క పాఠశాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

● **నాయుడుపేట టౌన్**: నాయుడుపేట పట్టణం, మండలంలో ఉన్న 78 ప్రభుత్వ పాఠశాలల్లో 47 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, 31 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు.

● **దొరవారిసత్రం**: మండలంలో 65 పాఠశాలలు, బీసీ గురుకులం, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. వీటిలో 58 పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి. 7 పాఠశాలల్లో ఓటింగ్ జరిగింది.

● **ఓజిలి**: మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపనులు 63 స్కూళ్లలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎన్నికల్లో వైసీపీ సానుభూతిపరులు విజయం సాధించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్తత తలెత్తడంతో ఎంఈవో శైలజ, ఎస్ఐ రవిబాబు సర్దుబాటు చేశారు.

● **గూడూరు అర్బన్**: పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 89 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 85 పాఠశాలలు ఏకగ్రీవమయ్యాయి. అయ్యవారిపాళెం ప్రాథమిక, ప్రాథమికోన్నత, మేగనూరు ప్రాథమికోన్నత, విందూరు ఉన్నత పాఠశాలలను కూడా టీడీపీ సానుభూతిపరులు చేజిక్కించుకున్నారు.


● **వాకాడు**: మండలంలోని 72 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎంఈవో నసీం అలీ తెలిపారు.

● **చిల్లకూరు**: మండలంలో 72 పాఠశాలుండగా 70 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. పారిచర్లవారి పాళెం ఉన్నత పాఠశాల, ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. 50 ఏకగ్రీవం కాగా, 20 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. అన్నీ కూటమి కైవసమయ్యాయి.

● పెళ్లకూరు: మండలంలో 65 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గతంలో ఏ ఎన్నికైనా వైసీపీ హవా కొనసాగగ ఈ ఎన్నికల్లో అందుకు భిన్నంగా టీడీపీ హవా కొనసాగడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

● **కోట**: మండలంలో 77 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల హాస్టళ్లకు పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. స్వల్ప సంఘటన మినహా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార టీడీపీ మద్దతుదారులే పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. 27 పాఠశాలలను ఏకగ్రీవం చేసుకున్నారు. మిగతా ఎన్నికలు జరిగిన పాఠశాలల్లో కూడా దాదాపుగా కూటమి మద్దతుదారులే ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు. గోవిందపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఛైర్మన్‌ను ఎన్నుకోగా వైస్‌ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోట మండలంలోని గోవిందపల్లి ఉన్నత పాఠశాలలో 217 మంది టీడీపీ, వైసీపీ మద్దతుదారులు ఎన్నికల హాల్‌లోకి ప్రవేశించారు. ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ రెండు వర్గాలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. పరిస్థితి గమనించిన విద్యాశాఖ అధికారులు అక్కడ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ ఎన్నికను వాయిదా వేసింది. అదే విధంగా ఊనుగుంటపాళెం ప్రాథమికోన్నత పాఠశాలలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఛైర్మన్ పదవి తమ వర్గానికే కావాలంటూ బాహాబహీకి దిగడంతో ఆ ఎన్నికను వాయిదా వేసినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యం



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 8 : కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. గురువారం ఆయన పట్టణంలో 40 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు, అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేశారు. ఇక్కడి ఆస్పత్రిలో గుండెపోటు బాధితులకు రూ.50 వేల విలువైన ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. వీటిని రోగులకు ఉచితంగా వేస్తారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన మందులు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. గత వైసీపీ పాలనలలో సర్కారు ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. వివిధ పరీక్షలు నిర్వహించేందుకు ల్యాబ్ సౌకర్యం, కాన్పులకు ప్రత్యేక వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. కాగా ఆస్పత్రికి దంత వైద్యులు సక్రమంగా రావడం లేదని తెలుసుకున్న ఆయన తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఎక్స్‌రే గది మూతవేసి ఉండటం గమనించి వైద్యుడు జిలానీని ప్రశ్నించారు. రేడియాలజిస్టు రాలేదని చెప్పడంతో మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఇకపై చూస్తూ ఊరుకోబోమన్నారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు పట్టీని తనిఖీ చేశారు.

ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగా

తిరుపతి (జీవకోన), ఆగస్టు 8: ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు యోగా కార్యక్రమం తిరుపతి సప్తగిరినగర్‌లోని రిలయన్స్ ట్రెండ్స్ పుట్‌వేర్ పక్కన గల కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం ప్రాంగణంలో జరుగుతుంది. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం, సాయం త్రం 6 నుంచి 9 గంటల వరకు, ఆదివారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. 14వ తేదీ ఉదయం, సా యంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఉచిత పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వివరాలకు నెం. 63055 52431, 8328426350 లలో సంప్రదించాలన్నారు.

గుంతలున్నాయి జాగ్రత్త...!

● ప్రమాదకరంగా మాంబట్టు సెజ్ రోడ్డు



మాంబట్టు రోడ్డులో ఏర్పాటు చేసిన సూచిక

తడ, ఆగస్టు 8: గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో అరకొరగా ప్యాచ్ వర్కులు చేసి మమ అనిపించారు. చినుకులు పడటంతోనే మళ్లీ రోడ్లన్నీ ఛిద్రమైపోయాయి. మాంబట్టు సెజ్‌లో ఉన్న రోడ్డు ఏపీఐఐసీ అధీనంలో ఉంది. సెజ్‌లో సుమారు 15 వరకు భారీ, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాలుగేళ్లుగా ఇక్కడి రోడ్లను అధికారులు పట్టించుకోకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతోపాటు ఏడాది క్రితం అపాచీ పరిశ్రమకు దగ్గర్లో చిన్న కల్వర్టు కూలిపోయింది. ఆ సమయంలో రాకపోకల కోసం అప్పటికప్పుడు కల్వర్టును పూడ్చేశారు. ప్రస్తుతం అక్కడ కూడా భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గుంతలకు సూచికబోర్డులను పెట్టారు. అయినా అధికారులు స్పందించడం లేదు. ఇకనైనా సెజ్ రోడ్డును గుంతలు లేకుండా మరమ్మలు చేపట్టాల్సి ఉంది.

తేనె టీగల దాడిలో యువకుడి మృతి



అశోక్ మృతదేహం

కోట, ఆగస్టు 8: మండలంలోని గూడలిలో గురువారం తేనె టీగల దాడిలో యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... గూడలికి చెందిన పూర్ణ అశోక్ (35) ఉదయాన్నే స్వర్ణముఖి నదిలో బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ హఠాత్తుగా అశోక్‌పై కొండ తేనె టీగలు దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అయన్ను కుటుంబసభ్యులు కోటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురాగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. మార్గమధ్యంలో యువకుడు మృతి చెందడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేశారు. కాగా ప్రైవేట్ ఆసుపత్రిలో అశోక్‌కు చికిత్స చేయడంలో నిర్లక్ష్యం చేశారంటూ కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిని నిలదీశారు. రెండు గంటలపాటు ఆసుపత్రి యాజ మాన్యంతో వాగ్వాదానికి దిగారు. స్థానిక పెద్దల చొరవతో అశోక్ కుటుంబసభ్యులు ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. అశోక్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

20 ఎకరాల్లో సర్వేపై రగడ



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

కోట, ఆగస్టు 8: మండలంలోని గున్నంపడియ వద్ద గురువారం చెన్నై, బెంగళూరు ఇండస్ట్రీయల్ కోస్టల్ కారిడార్ భూముల సర్వేకు సంబంధించి కొద్ది సేపు వాగ్వాదాలు జరిగాయి. కోస్టల్ కారిడార్‌కు కొత్తపట్నం పంచాయతీలో 444 ఎకరాలు వెళ్లనున్నాయి. ఈ నేపథ్యంలో 424 ఎకరాల సర్వే పూర్తైంది. మిగతా 20 ఎకరాల్లో సర్వే చేస్తుండగా చిల్లకూరు మండలం పల్లెపాళెంకు చెందిన కొంతమంది తాము కోట మండల పరిధిలో ఉన్న భూములను సాగు చేసుకుంటున్నామని పరిహారం ఇవ్వాలని, పేర్లు నమోదు చేసుకోవాలంటూ పట్టుబట్టారు. దీంతో తహసీల్దారు జయజయరావు, డీటీ మల్లికార్జున, సర్వే అధికారులు రెండు మండలాల రైతులతో చర్చించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు మిగతా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

ఎన్‌బీకేఆర్‌లో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న విభాగాధిపతులు

కోట, ఆగస్టు 8: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్విరాల్‌మెంటల్ ఎథిక్స్ అనే అంశంపై జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూళ్లూరుపేటకు చెందిన జువాలజీ విభాగాధిపతి శ్రీనివాస్, రసాయనశాస్త్ర విభాగాధిపతి సుబ్రహ్మణ్యంశాస్త్రి, ఫిజిక్ విభాగాధి పతి డాక్టర్ రాజా పాల్గొన్నారు. ప్రకృతి దైవంతో సమానమంటూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతిని పరి రక్షించుకుందామంటూ పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, ఎన్ఎస్ఎఫ్ ఆఫీసర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్ సర్వే పక్కాగా నిర్వహించాలి



పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్న ఎంపీడీవో

తడ, ఆగస్టు 8: ఓడీఎఫ్(ఓపెన్ డెఫకేషన్ ఫ్రీ) సర్వే పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో విజయకుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో ఇంటింటి కొళాయి, తాగునీరు, పారిశుధ్యం, బహిరంగ మల విసర్జనలపై వివరాలు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ సర్వే నిర్వహించి 15వ తేది నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమీక్ష




వాకాడు, ఆగస్టు 8 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులతో ఎంపీడీవో వెంకటేశ్వరరావు సమీక్షించారు. విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితరాలపై పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.40 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 75,109 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,285 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు





సంతోష్ శోభన్ - సునీత, టీనా

తిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఉపలోకాయుక్త జస్టిస్ పి రజని, పీఎం ప్రత్యేక అడ్వైజర్ రాజేశ్వర్‌ప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గణబాబు, భూమా అఖిలప్రియ, తిరుపతి మేయర్ శిరీష, హీరో సంతోష్ శోభన్, ప్రముఖ బాలీవుడ్ నటుడు గోవిందా సతీమణి సునీత అహూజా, కుమార్తె నటి టీనా ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.